# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

బుధవారం, హైదరాబాద్ 16.04.2025 | 24 క్యారెట్లు 88,615.00 | కిలో వెండి 1,07,787.00 | 37 °C | సంపుటి:3 | సంచిక:165

www.vishalabharati.com


# గీత దాటొద్దు..



## ఎవరైనా పార్టీ ఆదేశాలు పాటించాల్సిందే

- నేను, మంత్రులు కూడా అధిష్ఠానం ఆదేశాలు పాటిస్తాం
- మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది
- ఎమ్మెల్యేలంతా ప్రజల్లోకి వెళ్లాలి
- జూన్ 2 వరకూ విస్తృతంగా గ్రామాల్లో తిరగాలి
- మే 1 నుంచి జూన్ 2 వరకూ నేనూ నియోజకవర్గాల్లో పర్యటిస్తా
- సర్కారుపై దుష్ప్రచారం చేస్తుంటే ఒక్కరూ మాట్లాడరా..?
- రెండోసారి అధికారం చేపట్టడమే మన లక్ష్యం
- సీఎల్పీ సమావేశంలో ఎమ్మెల్యేలపై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్

**పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసేలా బహిరంగంగా ఎవరైనా మాట్లాడితే వేటు తప్పదని, కాంగ్రెస్‌ను నష్టపరిచిన తరువాత వ్యక్తులుగా నిలబడేవారికి ఎలాంటి ప్రయోజనం ఉండదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తాను, మంత్రులు కూడా పార్టీ ఆదేశాల మేరకే పనిచేస్తున్నామని తెలిపారు.**

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** శంషాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో మంగళవారం నిర్వహించిన కాంగ్రెస్ శాసనసభాపక్ష (సీఎల్పీ) అంతర్గత సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఉద్దేశించి రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. "మంత్రివర్గ విస్తరణ అంశం నా పరిధి, పీసీసీ పరిధి దాటిపోయింది. మా అభిప్రాయాలు పార్టీ పెద్దలకు చెప్పాం. ఎవరికి మంత్రి పదవులివ్వాలి, ఎప్పుడు ఇవ్వాలనే నిర్ణయాన్ని అధిష్ఠానం ఇప్పటికే రిజర్వు చేసి పెట్టింది. పదవుల విషయంలో ఎవరికైనా భిన్నాభిప్రాయాలుంటే పార్టీ అంతర్గత సమావేశాల్లో చెప్పాలి. బహిరంగంగా విమర్శించడం వల్ల ఎవరికి నష్టం అనేది ఆలోచించాలి. ఇష్టమొచ్చినట్లు

..మిగతా 2 లో

# కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర జరుగుతోందా?



- బీఆర్ఎస్ ఎమ్మెల్యే కామెంట్స్‌తో పొలిటికల్ హీట్
- ఎమ్మెల్యేలను కొంటారా..?
- మా జోలికొస్తే తాట తీస్తాం
- కేసీఆర్ మాటలే కొత్త ప్రభాకర్ రెడ్డి చెప్పారు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆగ్రహం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** బీఆర్ఎస్ నేత, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కామెంట్స్ తెలంగాణలో పొలిటికల్ హీట్‌కు కారణమయ్యాయి. కాంగ్రెస్ పాలనతో విసుగు చెందిన బిల్డర్లు, పారిశ్రామికవేత్తలు ప్రభుత్వాన్ని పడగొట్టాలంటున్నారని కొత్త ప్రభాకర్ రెడ్డి ఆరోపించారు. అవసరమైతే కాంగ్రెస్‌కు చెందిన ఎమ్మెల్యేలను కొనుగోలు చేయాలని... అందుకు అయ్యే ఖర్చును వారు

..మిగతా 2 లో

# సర్కారును కూల్చే ఉద్దేశం లేదు



- ఎప్పుడు ఎన్నికలొచ్చినా మాదే విజయం
- పార్టీ జాతీయ అధ్యక్షుడి రేసులో లేను
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ఓవైసీనే బిగ్‌బాస్
- భూములు, మద్యం విక్రయాలతోనే సర్కారు నడుస్తోంది
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మీడియాతో చిట్‌చాట్‌లో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చడానికి కుట్ర జరుగుతుందనే ప్రచారంపై ఆయన స్పందించారు. ప్రభుత్వాన్ని మేము కూలగొట్టం. ఐదేళ్లు

..మిగతా 2 లో

# కాంగ్రెస్ సర్కార్ ఐదేళ్లు కొనసాగాలని కోరుకుంటున్నా



- కేసీఆర్ కూడా అదే కోరుకుంటున్నారు
- ప్రభుత్వాన్ని పడగొట్టే ప్రయత్నాలు ఎప్పుడూ చేయలేదు
- ఇక ముందూ చేయబోమన్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

2 లో




# తెలంగాణ పోలీస్ నెం.1

- 'ఇండియా జస్టిస్ రిపోర్ట్-2025' వెల్లడి
- నాలుగు అంశాలపై అధ్యయనం
- మొత్తంగా రాష్ట్రానికి మూడో ర్యాంకు

2 లో

## సోనియా, రాహుల్‌పై
# ఈడీ చార్జ్‌షీట్

- ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో దాఖలు
- నేషనల్ హెరాల్డ్ షేర్లు అక్రమంగా బదలాయించారు
- రూ.988 కోట్ల మనీ లాండరింగ్ అభియోగాలు
- విచారణ 25కు వాయిదా
- దేశవ్యాప్తంగా నేడు కాంగ్రెస్ నిరసనలు
- మోడీది ప్రతీకార రాజకీయమంటూ ఆగ్రహం



**విశాలభారతి, నేషనల్ బ్యూరో:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నేషనల్ హెరాల్డ్ మనీ లాండరింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో కాంగ్రెస్

..మిగతా 2 లో




# నెలాఖరుకు ఇంటర్ ఫలితాలు

- ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య
- పరీక్ష రాసిన విద్యార్థుల్లో ఉత్కంఠ

2 లో

# మహిళా సాధికారతపై ఫోకస్..



- కోటిమందిని కోటీశ్వరులు చేయడం మా లక్ష్యం
- గ్రీన్ పవర్ తయారీలో మహిళలకు భాగస్వామ్యం
- అంబేద్కర్, రాజీవ్ గాంధీ వల్లే స్త్రీలకు అధికారాలు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** మహిళా సాధికారికతకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. దీని కోసం పలు పథకాలను అమలు చేస్తున్నట్టు తెలిపారు. మహిళా స్వయం సహాయక బృందాల కోసం 21వేల కోట్ల రూపాయలను కేటాయించినట్టు తెలిపారు. బంజారాహిల్స్ లోని తాజ్ దక్కన్ హోటల్ లో హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్, సిటీ పోలీస్ కలిసి నిర్వహించిన స్త్రీ సమ్మిట్ 2.0 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. మహిళా సాధికారికత గోల్ కాదని చేరుకోవాల్సిన గమ్యం అని అన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ హిందూ

..మిగతా 2 లో



# అలవోకగా అబద్ధాలు

- హామీల అమలులో సర్కారు విఫలం
- మహిళలను మోసం చేస్తున్న సర్కార్
- హరీశ్ రావు ఫైర్

2 లో



# కోల్‌కతా చెత్త రికార్డు

- 111 పరుగుల ఛేజింగ్‌లోనూ ఓటమి
- 95 పరుగులకే ఆలౌట్
- లో స్కోరింగ్ థ్రిల్లర్‌లో పంజాబ్ సంచలన విజయం

**విశాలభారతి, స్పోర్ట్స్ బ్యూరో:** ఐపీఎల్ 2025లో తొలిసారి లో స్కోరింగ్ మ్యాచ్ అభిమానులని అలరించింది. మంగళవారం (ఏప్రిల్ 15) ముల్లన్పూర్ లో కోల్‌కతా నైట్ రైడర్స్ పై

..మిగతా 2 లో



# నేను రౌడీ టైపు..

## కేసీఆర్‌లా సాఫ్ట్ కాదు

- మా నేతలను బెదిరిస్తే ఊరుకోను
- కాంగ్రెస్ వాళ్లను వదిలేదే లేదు
- పింక్‌బుక్‌లో అందరి పేర్లు రాస్తున్నా
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత వార్నింగ్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను బెదిరించే కాంగ్రెస్ నేతల పేర్లను పింక్ బుక్ లో నమోదు చేస్తామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. ఈనెల 27న వరంగల్‌లో జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు కార్యకర్తలు రాకుండా కొంతమంది అడ్డుకుంటున్నారని కవిత మండిపడ్డారు. తమ కార్యకర్తలకు ఫోన్లు చేస్తూ బెదిరిస్తున్నారని, వారందరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. మంగళవారం బాన్సువాడలో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశంలో ఎమ్మెల్సీ కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ 'బీఆర్ఎస్ నేతలను కాంగ్రెస్ నేతలు

..మిగతా 2 లో

## నెలాఖరుకు ఇంటర్ ఫలితాలు

విశాలభారతి, స్టేట్ బ్యూరో: ఏపీలో ఇంటర్ ఫలితాలు వెలువడటంతో తెలంగాణలో ఫలితాలు ఎప్పుడు వస్తాయో అంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. గత నెల 25న తెలంగాణ ఇంటర పరీక్షలు పూర్తయ్యాయి. నెల రోజుల లోపే ఫలితాలు ఇవ్వాలని ఇంటర్ బోర్డు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఈ నెల 25 లోపే ఫలితాలను వెల్లడించేందుకు సన్నాహకాలు చేస్తోంది ఇంటర్ బోర్డు. ఇంటర్ ఫలితాల ప్రకటనపై ఇంటర్ బోర్డు సెక్రటరీ ఐఏఎస్ కృష్ణ ఆదిత్య టీవీ9తో మాట్లాడుతూ.. ఏప్రిల్ చివరి వారంలో విడుదల చేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే స్పాట్ వాల్యూయేషన్ తో పాటు ర్యాండమ్ రీ వాల్యూయేషన్ ప్రక్రియ పూర్తైంది. చివరి ప్రాసెస్ లో భాగంగా వెరిఫికేషన్ కోసం సీజీజీకి పంపించినట్లు సెక్రటరీ కృష్ణ ఆదిత్య తెలిపారు, ఈ నెల 20 నాటికి ఫలితాలు వెల్లడించేందుకు అంతా రెడీగా ఉంటుందని. 20 తర్వాత సీఎం రేవంత్ రెడ్డి అపాయింట్ మెంట్ ఆధారంగా ఫలితాలు వెల్లడిస్తామని చెప్పారు.సాధారణంగా ఇంటర్ ఫలితాలు స్పాట్ వాల్యూయేషన్ తర్వాత సీజీజీ వెరిఫికేషన్ అవగానే ఇస్తారు. కానీ తొలిసారిగా స్పాట్ వాల్యుయేషన్ తర్వాత ర్యాండమ్ రీ వాల్యూయేషన్ చేసి మరి ఫలితాలను వెల్లడిస్తున్నారు. ఫలితాల వెల్లడి తర్వాత ఏటా 60 వేల మంది విద్యార్థులు ఒకటి, రెండు మార్కులు తక్కువ వచ్చాయని రీ వాల్యూయేషన్ కు అప్లై చేస్తున్నారు. అలాంటి వారిని దృష్టిలో పెట్టుకొని ముందే తక్కువ మార్కుల తేడాతే ఫెయిల్ న పేపర్లను మరోసారి వాల్యూయేషన్ చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

### సోనియా, రాహుల్‌పై

# ఈడీ చార్జ్‌షీట్

తరువాయి భాగం

పార్టీ అగ్రనేతలు, ఎంపీలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతోపాటు ఇతర నిందితులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో చార్జిషిట్ దాఖలు చేసింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శామ్ పిట్రోడా, సుమన్ దూబే, సునీల్ భండారీతో పాటు యంగ్ ఇండియా, డాటెక్స్ మెర్కండైజ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలను చార్జిషిట్ లో నిందితులుగా చేర్చింది. రూ.2,000 కోట్ల విలువైన నేషనల్ హెరాల్డ్ ఆస్తులను దోచుకోవడానికి కుట్ర జరిగిందని, ప్రస్తుతం వాటి విలువ రూ.5,000 కోట్లు ఉంటుందని ఈడీ స్పష్టంచేసినట్లు సమాచారం. ఈ కేసులో సోనియా, రాహుల్ గాం దీలను ఈడీ గతంలో పలుమార్లు విచారించింది. వారిపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయడం మాత్రం ఇదే మొదటిసారి.

మనీ లాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్ఏ)లోని వేర్వేరు సెక్షన్ల కింద ఈ నెల 9వ తేదీన ఈ చార్జిషీట్‌ను ఈడీ దాఖలు చేసింది. ఇందులో నంబర్-1గా సోనియా గాం దీ, నెంబర్-2గా రాహుల్ గాంధీ పేర్లను ప్రస్తావించింది. ఈడీ చార్జిషీట్‌ను పరిశీలించిన ప్రత్యేక జడ్జి విశాల్ గాగ్నే దీనిపై తదుపరి విచారణను ఈ నెల 25వ తేదీకి వాయిదా వేశారు. మరోవైపు ఇదంతా రాజకీయ కక్ష సాధింపు అని కాంగ్రెస్ ఆరోపించింది.

# అలవోకగా అబద్ధాలు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

హామీల అమలులో ఘోరంగా విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం అలవోకగా అబద్ధాలు చెబుతూ ప్రజలను నమ్మించే ప్రయత్నాలు చేస్తోందని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. మహిళలకు వడ్డీ లేని రుణాల విషయంలో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సోమవారం మంచిర్యాలలో చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ హరీశ్‌రావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'రూ.21 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు మహిళలకు ఇచ్చామని చెప్పి..మళ్లీ మహిళలను మోసం చేసే ప్రయత్నం చేశారు. బ్యాంకు లింకేజీ కల్పించి..మొత్తం రూ.21 వేల కోట్లూ వడ్డీ లేని రుణాలే అని ప్రచారం చేసుకోవడం కాంగ్రెస్‌కే చెల్లింది. రూ.5 లక్షల వరకే వడ్డీ లేని రుణం..మిగతా రూ.15 లక్షలకు మహిళలే వడ్డీలు కడుతున్నారన్నది వాస్తవం కాదా? స్కూల్ విద్యార్థుల డ్రెస్ కుట్టు ఛార్జీలు రూ.50 ఇచ్చి..రూ.75 ఇస్తున్నామని ప్రచారం చేసుకున్నారు. మేము నిలదీస్తే మిగతా రూ.25 విడుదల చేశారు. కానీ ఇవి ఇంకా మహిళలకు చేరలేదు. వెంటనే చెల్లించండి. ఈ కుట్టు ఛార్జీలు రూ.150కి పెంచాలని మహిళా సంఘాల తరఫున డిమాండ్ చేస్తున్నాం. ఇప్పటికైనా ప్రచార యావ పక్కన పెట్టి మహిళలకిచ్చిన అన్ని హామీలను అమలు చేయాలి' అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలు సహా ఫీల్డ్ అసిస్టెంట్లకు, ఏపీఓలకు, సీఓలకు మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం శోచనీయమని, వెంటనే వేతనాలు చెల్లించాలని ఆయన కోరారు.

# మహిళ సాధికారతపై ఫోకస్..

తరువాయి భాగం

కోర్టు బిల్లు ద్వారా మహిళలకు విశేష హక్కులు కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. మహిళలు, బాలికల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. ఈ క్రమంలోనే మహిళా స్వయం సహాయక బృందాలకు నిధులను అందచేస్తున్నట్టు తెలిపారు.

ఇలా ఆర్థిక సాయం పొందుతున్న స్వయం సహాయక బృందాలు పలు రకాల వస్తువులను ఉత్పత్తి చేస్తున్నట్టు తెలిపారు. వాటికి ప్రభుత్వమే మార్కెట్ ను క్రియేట్ చేస్తోందన్నారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి దిశగా మహిళలను ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. ఇలా ఉత్పత్తి అయ్యే విద్యుత్ ను ప్రభుత్వమే బై బ్యాక్ గ్యారంటీ ద్వారా కొంటుందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయటమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందన్నారు.

పోలీస్ కమిషనర్ సీ.వీ.ఆనంద్ మాట్లాడుతూ ఇళ్లల్లో, పని చేసే చోట మహిళల పట్ల కొనసాగుతున్న వివక్షతను పూర్తిగా రూపుమాపాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికీ చాలామంది తల్లిదండ్రులు ఆడపిల్లలు వద్దనుకోవటం బాధాకరమని చెప్పారు. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా పోటీ పడుతూ అద్భుత విజయాలు సాధిస్తున్నారని చెప్పారు. పోలీసు శాఖలో చేరుతున్న మహిళల సంఖ్య కూడా క్రమంగా పెరుగుతోందని తెలిపారు. మహిళలకు సాధికారికత కల్పించినపుడే జాతీయ జీడీపీ వృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి శేఖర్ రెడ్డి స్వాగతం పలికారు. డాక్టర్ భానుశ్రీ వెల్పాండియన్, కాయతీ నర్వానే, వనిత దత్త, నమిత బంకా, జెన్నీఫర్ లార్సన్, ఐఏఎస్ అధికారిని దివ్య దేవరాజన్, ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ డాక్టర్ లావణ్యతోపాటు పలువురు పాల్గొన్నారు.

# కోల్‌కతా చెత్త రికార్డు

తరువాయి భాగం

పంజాబ్ కింగ్స్ 16 పరుగుల తేడాతో థ్రిల్లింగ్ విక్టరీ కొట్టింది. 111 పరుగుల లక్ష్య ఛేదనలో పంజాబ్ బౌలర్లు చూపించిన పోరాటం అద్భుతం. చాహల్ 4 వికెట్లతో మ్యాచ్ స్వరూపాన్నే మార్చేయగా చివర్లో అర్ష దీప్ సింగ్, జాన్సెన్ వికెట్లు తీసి పంజాబ్ కు సంచలన విజయాన్ని అందించారు. ఛేజింగ్ లో రస్సెల్ బయపెట్టినా మార్కో జాన్సెన్ బౌల్డ్ చేసి పంజాబ్ జట్టులో విజయాన్ని నింపాడు. మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ 15.3 ఓవర్లలో కేవలం 111 పరుగులకే ఆలౌట్ అయింది. 112 పరుగుల లక్ష్య ఛేదనలో కోల్‌కతా 95 పరుగులకే ఆలౌట్ అయింది. 112 పరుగుల లక్ష్య ఛేదనలో కోల్‌కతా నైట్ రైడర్స్ కు ఆరంభంలోనే బిగ్ షాక్ తగిలింది. తొలి ఓవర్ లోనే సునీల్ నరైన్ 5 పరుగులు చేసి ఔటయ్యాడు. జేవియర్ బార్ట్‌లెట్ వేసిన రెండో ఓవర్లో డికాక్ (2) భారీ షాట్ కు ప్రయత్నించి బౌండరీ దగ్గర క్యాచ్ ఇచ్చి పెవిలియన్ కు చేరాడు. ఈ దశలో రఘువంశీ, కెప్టెన్ రహానే జట్టును ఆదుకున్నారు. రహానే చిన్నగా ఆడినా.. మరో ఎండ్ లో రఘువంశీ దూకుడుగా ఆడుతూ స్కోర్ కార్డును ముందుకు తీసుకెళ్లారు. పవర్ ప్లే చివరి ఓవర్లో 19 పరుగులు రావడంతో మొదటి 6 ఓవర్లలో కేకేఆర్ 55 పరుగులు చేసింది. ఈ దశలో ఒక్కసారిగా కోల్‌కతా తడబడింది. క్రమం తప్పకుండా వికెట్లను కోల్పోయింది. మొదట రహానే (17)ను చాహల్ ఎల్బీడబ్ల్యూ రూపంలో ఔట్ చేయగా.. ఇదే ఊపులో రఘువంశీ (37)ని వెనక్కి పంపాడు. ఈ సమయంలో పంజాబ్ పట్టు బిగించింది. వెంట వెంటనే మరో 4 వికెట్లు తీసి కేకేఆర్ ను ఒత్తిడిలోకి నెట్టింది. వెంకటేష్ అయ్యర్ (7), రింకూ సింగ్ (2), రమణ్ దీప్ సింగ్ (0), హర్షిత్ రానా (3) వరుస పెట్టి పెవిలియన్ కు క్యూ కట్టారు. చాహల్ నాలుగు వికెట్లు పడగొట్టి మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. రస్సెల్ చాహల్ బౌలింగ్ లో రెండు సిక్సర్లు, ఫోర్ కొట్టి మ్యాచ్ ను కేకేఆర్ వైపు తిప్పాడు. అయితే చివర్లో అర్షదీప్ వైభవ్ అరోరాను.. రస్సెల్ (17) ను జాన్సెన్ ఔట్ చేయడంతో పంజాబ్ ఓడిపోయే మ్యాచ్ లో గెలిచింది.

అంతకముందు మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ బ్యాటింగ్ లో ఘోరంగా ఆడింది. బాధ్యత లేని ఆట తీరుతో స్వల్ప స్కోర్ కే పరిమితమైంది. కోల్‌కతా బౌలర్లు విజృంభించడంతో 15.3 ఓవర్లలో కేవలం 111 పరుగులకే ఆలౌట్ అయింది. 30 పరుగులు చేసిన ఓపెనర్ ప్రభ్‌సిమ్రాన్ సింగ్ టాప్ స్కోరర్ గా నిలిచాడు.

# గీత దాటొద్దు..

మొదటిపేజీ తరువాయి

మాట్లాడితే సహించేది లేదు. అందరూ సంయమనం పాటించాలి. ఎన్నోసార్లు పార్టీ పరంగా అవకాశాలు వచ్చి త్రుటిలో జారిపోయినా.. గీత దాటకుండా పనిచేయడంతో ఇప్పుడు ఎమ్మెల్సీగా ఎన్నికైన అద్దంకి దయాకర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి.

**అవాస్తవ ప్రచారాన్ని తిప్పికొట్టాలి**

ప్రతిపక్షాలు అవాస్తవాలతో ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం చేస్తుంటే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎందుకు తిప్పికొట్టడం లేదు? అసత్య ప్రచారాన్ని ఎక్కడికక్కడ ఖండించండి. ఆధారాలతో సహా వివరాలు బయటపెట్టండి. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని కొన్ని సమస్యలకు కాంగ్రెస్ ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపింది. సన్నబియ్యం పథకం ఒక అద్భుతం. ఆనాడు రూ.2 కిలో బియ్యంలా ఇప్పుడు సన్నబియ్యం పథకం ప్రజలకు శాశ్వతంగా గుర్తుంటుంది. కేసీఆర్ ఓటమికి ధరణి లోపాలు కూడా ఒక కారణం. వాటన్నిటినీ సవరించి.. మనం అమలు చేస్తున్న భూభారతి రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. దేశంలోనే ఇందిరమ్మ ఇళ్ల పథకం ఆదర్శంగా నిలిచింది. కులగణన ద్వారా వందేళ్ల సమస్యను పకడ్బందీగా పరిష్కరించాం. ఇది మోదీ పాలనకు మరణశాసనంలా మారనుంది. విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో బలహీనవర్గాలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని బిల్లులు తీసుకొచ్చాం. ఇది కాంగ్రెస్ పారదర్శక పాలనకు నిదర్శనం. జటిలమైన ఎస్సీ ఉపకులాల వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాం. ఎస్సీ వర్గీకరణపై జీవో జారీ అయినందున వచ్చే నెల నుంచి కొత్త ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ల జారీ ప్రారంభమవుతుంది. ఈ విజయాలన్నిటిపై జూన్ 2 వరకూ ఎమ్మెల్యేలు గ్రామాల్లో తిరిగి విస్తృతంగా ప్రచారం చేయాలి. ఏయే కార్యక్రమాలు చేపట్టాలనేది పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచిస్తారు.

జపాన్ పర్యటన ముగిసిన తర్వాత.. మే నెల ఒకటి నుంచి జూన్ 2 వరకూ నేను కూడా అన్ని నియోజకవర్గాల్లో పర్యటిస్తాను. ఏ నియోజకవర్గంలో.. ఏ సమావేశంలో



పాల్గొనాలో ఎమ్మెల్యేలే ముందుగా చెబితే అక్కడికి వస్తాను. వచ్చే నెల ఒకటి నుంచి ప్రతి ఎమ్మెల్యేను వ్యక్తిగతంగా కలిసి మాట్లాడతాను. మరోసారి మీ నియోజకవర్గంలో గెలవడానికి ఏయే అభివృద్ధి పనులు చేయాలో వివరాలు సేకరించండి. వాటిని పూర్తిచేయడానికి నిధులు మంజూరు చేయిస్తాను. కంచ గచ్చిబౌలి భూముల్లో ఐటీ హబ్ ఏర్పాటు చేయాలని యోచించాం. ఈ భూములపై ప్రభుత్వానికి ఆదాయం వస్తే సంక్షేమ పథకాల అమలుతో కాంగ్రెస్‌కు మంచిపేరు వస్తుందని భారాస, భాజపా ఏకమై దుష్ప్రచారం చేస్తున్నాయి. ఈ భూముల అమ్మకాలు ఆగిపోయేలా చూడాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి.. హోంమంత్రి అమిత్‌షాకు చెప్పారు. ఈ భూముల్లో వన్యప్రాణులున్నట్లు ఏఐ టెక్నాలజీతో బోగస్ చిత్రాలు, వీడియోలను ప్రతిపక్షాలు సృష్టిస్తే వాటిని మోదీ కూడా నమ్మారు. హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ వద్ద ఉన్న 2300 ఎకరాల్లో 400 ఎకరాలు ప్రభుత్వానివే. ఈ భూములపై ఆదాయం రాకుండా బీజేపీ, బీఆర్ఎస్ అడ్డుకుంటున్నాయి'' అని సీఎం చెప్పినట్లు తెలుస్తోంది. ఇందిరమ్మ ఇళ్ల పథకం మొదటి దశ కింద ఇళ్లు మంజూరైన లబ్ధిదారుల్లో పునాదుల వరకు పనులు పూర్తి చేసిన 12 మందికి మొదటి విడతగా రూ.లక్ష విలువైన చెక్కులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా అందజేశారు. ప్రతి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తన నెలవారీ వేతనం నుంచి రూ.20 వేలు పార్టీకి, సీఎల్పీకి ఇవ్వాలని పీసీసీ ఈ సందర్భంగా నిర్ణయించింది.

# కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర జరుగుతోందా?

తరువాయి భాగం

భరిస్తామని చెబుతున్నారని... కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉంచకూడదని అంటున్నారని కూడా అన్నారు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల అసంతృప్తి తీవ్రంగా ఉందని విమర్శించారు. రాష్ట్రంలో పిల్లల నుంచి పెద్దల దాకా అందరూ కాంగ్రెస్ పాలనతో విసిగిపోయారని ఆరోపించారు. అయితే కొత్త ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి. నిజంగానే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయా? అనే చర్చ కూడా మొదలైంది.

**కాంగ్రెస్ నేతల ఫైర్..**

అయితే కొత్త ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు మండిపడుతున్నారు. రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు... కొత్త ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నారు. కొత్త ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యల వెనక ఎవరున్నారనేది తెలియాల్సి ఉందని కొందరు కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... కొత్త ప్రభాకర్ రెడ్డిది ట్రాన్స్ పోర్ట్ వ్యాపారం అనుకున్నాని, కానీ ఈ మధ్య జ్యోతిష్యం కూడా చెబుతున్నారని ఎద్దేవా చేశారు. వాళ్లు ప్రభుత్వాన్ని కూలుస్తాం అంటే ఊరుకుంటామా? అని ప్రశ్నించారు. ఇక్కడ ఎవరూ చేతులు కట్టుకుని కూర్చోలేదని హెచ్చరించారు.

**మా జోలికి వస్తే తాట తీస్తాం: పొంగులేటి**

దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. తమ జోలికివస్తే తాట తీస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ హయాంలో అక్రమంగా దోచుకున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలోని పలువురు వ్యాపారులు రేవంత్ సర్కార్ కూల్చేందుకు ప్రయత్నిస్తున్నారంటూ కొత్త ప్రభాకరరెడ్డి చేసిన వ్యాఖ్యలను మంత్రి ఖండించారు.. హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, అధికార దాహంతో బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని విమర్శించారు. కొత్త ప్రభాకర్‌రెడ్డి అంటే కేసీఆర్ ఆత్మ అని ఆరోపణలు చేశారు. కేసీఆర్ మాటలనే కొత్త ప్రభాకర్‌రెడ్డి చెప్పారని అన్నారు. ధరణి పోర్టల్‌తో భూములను అక్రమంగా దోచుకుని.. వారి అనుయాయులకు కట్టబెట్టారని ఆరోపించారు. అక్రమంగా దోచుకున్న భూములను తమ ప్రభుత్వం.. వెనక్కి తీసుకుంటుందని బీఆర్ఎస్ నేతలు భయపడుతున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.

# నేను రౌడీ టైపు..

తరువాయి భాగం

బెదిరిస్తున్నారు. నేను కేసీఆర్ లాగా కాదు.. నేను రౌడీ టైపు. మా నేతలను బెదిరించే అధికారులను, కాంగ్రెస్ నాయకులను వదిలిపెట్టే ప్రసక్తే లేదు. కాంగ్రెస్ నాయకుల తాటాకు చప్పుళ్లకు భయపడేదే లేదు. వాళ్ల తాతలు, ముత్తాతలు, జేజమ్మలు ఎవరు దిగొచ్చినా కూడా భయపడేవాళ్లెవరూ లేరు. మా నేతలను బెదిరించే వారి పేర్లు పింక్ బుక్‌లో నమోదు చేస్తా. మా పోరాట ఫలితంగానే తెలంగాణ వచ్చింది. అందుకే వరంగల్ రజతోత్సవ వేడుక తెలంగాణ కుంభ మేళా అవుతుంది. ప్రజలు మళ్లీ బీఆర్ఎస్ పాలన కోరుకుంటున్నారు. బాన్సువాడలో ఉపఎన్నిక వస్తే గులాబీ జెండా ఎగరడం ఖాయం. 15 నెలల్లో ప్రజల విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్ ప్రభుత్వానికి నోబెల్ బహుమతి ఇవ్వాలి. కాంగ్రెస్ పాలన అంటేనే మాటల ప్రభుత్వం అనేది తేలిపోయింది. డబ్బుల కోసమే కొంతమంది నాయకులు ఆ పార్టీకి వలస వెళ్లారు'అని అన్నారు. 'మాట తప్పడం... మడమ తిప్పడమే కాంగ్రెస్ నైజం. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సంతకాలు పెట్టిన గ్యారెంటీ కార్డులను కాంగ్రెస్ నాయకులు ఇంటింటికి పంచి ఓట్లేయించుకున్నారు. ఇప్పుడు గ్యారెంటీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నది. గతంలో తెలంగాణ ఇస్తామని హామీ ఇచ్చి పదేళ్ల పాటు అరిగోస పెట్టింది కాంగ్రెస్ పార్టీ. వందలాది మంది తెలంగాణ బిడ్డల ఆత్మబలిదానాలకు కారణం కాంగ్రెస్ పార్టీ. ఏడాదిన్నర పాలనలోనే ఇంత వ్యతిరేకత మూటగట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి నోబెల్ ప్రైజ్ ఇవ్వాలి' అని కవిత విమర్శించారు.

# సర్కారును కూల్చే ఉద్దేశం లేదు

తరువాయి భాగం

అధికారంలో ఉండాలి. ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ ఓడిపోతుంది. రాష్ట్రంలో వీధి లైట్లకు డబ్బులు ఇవ్వలేని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో మజ్లిస్ వర్సెస్ బీజేపీ పోటీ ఉంటుంది. రాష్ట్రంలో ఎలాంటి పొత్తు పెట్టుకోము. ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లా విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టాం. ప్రజలు ఒకసారి అనుకుంటే గెలుపును ఎవరూ ఆపలేరు. ప్రజాస్వామ్యంలో ప్రజలే సుప్రీం.. అని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణలో భూములు, మద్యం విక్రయాలు, అప్పులతో ప్రభుత్వాన్ని నడుపుతున్నారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. భూముల అమ్మకంతో బీఆర్ఎస్ తో కాంగ్రెస్ పోటీపడుతోందన్నారు. హెచ్‌సీయూ అంశంలో తనపై కేసు పెడితే ఎదుర్కొనేందుకు సిద్ధమని తెలిపారు. అర్ధరాత్రి ఫ్లడ్ లైట్లు పెట్టి చెట్లను నరికిన ప్రభుత్వాలను చూశామా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే రాజాసింగ్ తమ పార్టీ నేత అని, ఆయన అంశంపై అంతర్గతంగా చర్చించుకుంటామని తెలిపారు.

# కాంగ్రెస్ సర్కార్ ఐదేళ్లు కొనసాగాలని కోరుకుంటున్నా

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఐదేళ్లు పూర్తికాలం కొనసాగాలని తాను కోరుకుంటున్నానని బీఆర్ఎస్ నేత, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి కాలం కొనసాగాలని తమ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర రావు కూడా ఆకాంక్షిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రభుత్వాన్ని పడగొట్టాలని తాము ఎప్పుడూ ప్రయత్నించలేదని ఆయన స్పష్టం చేశారు. ఇక ముందు కూడా ఆ ప్రయత్నాలు చేయబోమని తేల్చి చెప్పారు. గజ్వేల్‌లో మాత్రమే కాకుండా, తెలంగాణ వ్యాప్తంగా ఎక్కడ భూదందాలు జరిగినా ప్రభుత్వం వెలికి తీయాలని డిమాండ్ చేశారు. ఇటీవల కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, ఈ ప్రభుత్వాన్ని కూల్చివేయాలని కొంతమంది తమతో చెప్పారని కొత్త ప్రభాకర్ రెడ్డి నిన్న సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆయన మరోసారి స్పందించారు.

# తెలంగాణ పోలీస్ నెం.1

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

పోలీసుశాఖ పనితీరులో దేశంలోనే తెలంగాణ మొదటిస్థానం సాధించింది. ప్రజలకు న్యాయం అందించే విషయంలో కోటి కంటే ఎక్కువ జనాభా ఉన్న 18 రాష్ట్రాలతో పోల్చినప్పుడు ఈ ఘనత సాధించింది. ఈ మేరకు 'ఇండియా జస్టిస్ రిపోర్ట్ 2025' పేరుతో టాటా ట్రస్ట్ మంగళవారం నివేదిక విడుదల చేసింది. ప్రజలకు న్యాయం అందించే పోలీసులు, న్యాయస్థానాలు, జైళ్లు, న్యాయసహాయం(లీగల్ ఎయిడ్) వంటి విభాగాల పనితీరును అధ్యయనం చేసిన టాటా ట్రస్ట్ 2019 నుంచి రాష్ట్రాలకు ర్యాంకింగ్‌లు ఇస్తోంది. సెంటర్ ఫర్ సోషల్ జస్టిస్, కామన్ కాజ్, కామన్‌వెల్త్ హ్యూమన్ రైట్స్ ఇనిషియేటివ్ తదితర సంస్థల సహకారంతో తాజా నివేదిక రూపొందించింది. తాజాగా వెల్లడించిన నాలుగో ఎడిషన్ ర్యాంకుల్లో దేశవ్యాప్తంగా పోలీసింగ్‌లో తొలిస్థానంలో నిలిచిన తెలంగాణ.. జ్యుడిషియరీలో 2.. జైళ్ల విభాగంలో 7.. లీగల్‌ఎయిడ్‌లో 10వ స్థానంలో.. 6.15 స్కోర్‌తో ఓవరాల్‌గా మూడో స్థానంలో నిలిచింది. 6.78 స్కోర్‌తో కర్ణాటక మొదటి స్థానం సాధించింది.



విశాల భారతి
తెలుగు దిన పత్రిక
బుధవారం,
16.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com





## ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

- మార్కెట్ చైర్మన్ దొంత సుధాకర్.

సైదాపూర్ ,విశాలభారతి:

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించి సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ చైర్మన్ దొంత సుధాకర్ అన్నారు. మండలం లోని ఆకునూరు ఘనపూర్ రాయికల్ తండా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ దొంత సుధాకర్ మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించి మద్దతు ధరతో పాటు బోనస్ ను పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏటీఎం కుమారస్వామి మహిళా సంఘం సభ్యులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## లంచం తీసుకుంటూ పట్టుబడ్డ బయోడైవర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ విప్పర్ల శ్రీనివాస్

- గచ్చిబౌలిలో ఏసీబీ సోదాలు
- రూ.70 వేల నగదు స్వాధీనం

శేరిలింగంపల్లి,విశాలభారతి:



ఏసీబీకి రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డ బయోడైవర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ విప్పర్ల శ్రీనివాస్.

శేరిలింగంపల్లి వెస్ట్ జోన్ కార్యాలయంలో జీహెచ్ఎంసీ అర్బన్ బయోడైవర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు.ఓ బాధితుడు ఫిర్యాదు మేరకు మంగళవారం మధ్యాహ్నం శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా ఏసీబీ డైరెక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు.జోన్ కార్యాలయంలోని అర్బన్ బయోడైవర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ విప్పర్ల శ్రీనివాస్ ఫిర్యాదు దారుడి నుంచి రూ.2.2 లక్షల లంచం డిమాండ్ చేయగా.. రూ.70 వేలు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డాడు. విప్పర్ల శ్రీనివాస్ చాంద్రాయణ గుట్ట సర్కిల్ లో బయోడైవర్సిటీ ఇన్చార్జిగా వ్యవహరిస్తున్నారు. చంద్రాయన్ గుట్ట సర్కిల్ పనికి సంబంధించి ఓ కాంట్రాక్టర్ వద్ద లంచం డిమాండ్ చేశాడు. మొక్కల పదార్థాల సరఫరాకు చెక్ మెజర్డ్ బిల్లులను క్లియర్ చేసేందుకు శ్రీనివాస్ లంచం డిమాండ్ చేశాడు. బాధితుడిని లంచం డబ్బులు తీసుకుని శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయానికి రావాలని సూచించాడు. దీంతో కాంట్రాక్టర్ అర్బన్ బయోడైవర్సిటి డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ తెలిపిన విధంగా శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలోని శ్రీనివాస్ వద్దకు వచ్చాడు. అతని వద్ద నుండి డబ్బులు తీసుకుంటూ శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో శ్రీనివాస్ ఏసీబీ అధికారుల కు పట్టుబడ్డాడు.



జేపీ దర్గాలో మొక్కులు చెల్లిస్తున్న రాగం నాగేందర్ యాదవ్ కుటుంబం.

## జేపీ దర్గాలో మొక్కలు చెల్లించిన కార్పొరేటర్ నాగేందర్

శేరిలింగంపల్లి,విశాలభారతి:

ప్రముఖ జహంగీర్ పీర్ దర్గాలో శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్,పఠాన్చేరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్,సీనియర్ నాయకులు మారబోయిన రాజు యాదవ్ లతో కలిసి కుటుంబ సమేతంగా ప్రత్యేక ప్రార్ధనలు చేశారు.ఇటీవల వివాహం చేసుకున్న ఆయన తనయుడు నూతన వధూవరులు రాగం జాగృతి, అనిరుధ్ యాదవ్ లు దర్గాలో చాదర్ సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు.ఈ మేరకు మాట్లాడుతూ.. తన డివిజన్ నియోజకవర్గం ప్రజలు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో ఆనందంగా ఉండాలని ప్రార్ధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమీపబంధువులు,మిత్రులు, తదితరులు,పాల్గొన్నారు.



## మధుయాష్కి మాతృమూర్తికి ఘన నివాళి

అనసూయ యాస్కి ప్రథమ వర్ధంతి

ఎల్బీనగర్ ,విశాలభారతి:

టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ మాతృమూర్తి కీర్తిశేషులు అనసూయ ప్రథమ వర్థంతి కార్యక్రమం మంగళవారం హయత్ నగర్ టీనగర్ కాలనీలోని వారి నివాసంలో ఆత్మీయ వాతావరణంలో జరిగింది. ఈ సందర్భంగా బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై అనసూయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకుంటూ, ఆత్మీయ క్షణాలను పంచుకున్నారు.అనసూయ జీవితకాలంలో అనుసరించిన మానవీయ విలువలు, కుటుంబపట్ల అంకితభావం, సమాజంపై చూపిన ప్రేమకు గుర్తుగా పలువురు ఆమె సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమానికి రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు , తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద , జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్లు, నియోజకవర్గ నేతలు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మహిళా నాయకురాళ్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే రాజా సింగ్ కు బైండ్ల కుమార్ శుభాకాంక్షలు

పటాన్ చెరు,విశాలభారతి:



గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ జన్మదినం సందర్భంగా టెలికం బోర్డు మెంబర్, బిజెపి జిల్లా కార్యదర్శి బైండ్ల కుమార్ శుభాకాంక్షలు తెలియజేశారు. మంగళవారం రాజసింగ్ ఇంటికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. శాలువ కప్పి,గజమాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యదర్శి పుల్లం గారి సురేందర్, రాము, రఘు పాల్గొన్నారు.

# వరంగల్‌కు వేలాదిగా తరలివెళ్దాం..

- రజతోత్సవ సభను విజయవంతం చేద్దాం
- బీఆర్ఎస్ పటాన్ చెరు కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి
- ముత్తంగిలో ముఖ్య కార్యకర్తల సమావేశం

పటాన్ చెరు,విశాలభారతి





ఈ నెల 27న వరంగల్ ఎల్కతూర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పటాన్ చెరు నియోజకవర్గం నుంచి వేలాదిగా తరలి వెళ్లి విజయవంతం చేద్దామని బీఆర్ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పటాన్ చెరు మండలం ముత్తంగిలోని పీఎస్ఆర్ గార్డెన్స్ లో పటాన్ చెరు పట్టణ, మండల బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పటాన్ చెరు కార్పొరేటర్మెట్టు కుమార్ యాదవ్, మాజీ జడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఆదర్శ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ నెల 27న వరంగల్ ఎల్కతూర్తిలో పండుగ వాతావరణంలో రజతోత్సవ సభ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సభ తెలంగాణ చరిత్రలో కొత్త అధ్యాయం లిఖించబోతోందని ఆయన తెలిపారు. అధికార కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత ఉందని, బీఆర్ఎస్ ను దూరం చేసుకుని తప్పు చేశామని ప్రజలలో పశ్చాత్తాప కనబడుతోందన్నారు. అడగని పథకాలు సైతం ఆచరణలో అమలు చేసి చూపించిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని అన్నారు. సభ రోజు గ్రామ గ్రామాన పార్టీ జెండాలు ఆవిష్కరించుకుని, వరంగల్ బయలుదేరాలని సూచించారు. అనంతరం వరంగల్ సభకు సంబంధించిన వాల్ పోస్టర్లను నేతలుతో కలిసి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కోలన్ బాల్ రెడ్డి, తెలంగాణ ఉద్యమకారుడు సీనియర్ నాయకులు శ్రీధర్ చారి, మెరాజ్ ఖాన్, గడిల కుమార్ గౌడ్, మల్లారెడ్డి, ఆర్.సి పురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, పటాన్ చెరు డివిజన్, మండల బీఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచులు, ఉప సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.



## ఆడపడుచులకు అండగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- పటాన్ చెరులో 272 చెక్కుల పంపిణీ

పటాన్ చెరు,విశాలభారతి:

పేదింటి ఆడపడుచులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు అండగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గం పరిధిలోని వివిధ గ్రామాలు, పట్టణాలు, డివిజన్ల పరిధిలోని 272 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా మంజూరైన రెండు కోట్ల 72 లక్షల రూపాయల విలువైన చెక్కులను ఎమ్మెల్యే జిఎంఆర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని తెలిపారు. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సింధు ఆదర్శ్ రెడ్డి, పుష్ప నగేష్, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ జడ్పిటిసిలు సుధాకర్ రెడ్డి, కుమార్ గౌడ్, బాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ దేవానంద్, వెంకట్ రెడ్డి, షేక్ హుస్సేన్, ఆయా మండలాల తహసిల్దార్లు, నాయకులు పాల్గొన్నారు.



## పోగొట్టుకున్న 10 ఫోన్లు రికవరీ

- బాధితులకు అప్పగించిన సీఐ జగదీష్
- సీఈఐఆర్ ద్వారా ఫోన్లు రికవరీ

ఇబ్రహీంపట్నం,విశాలభారతి:

ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న 10 సెల్ ఫోన్ లను పోలీసులు మంగళవారం బాధితులకు అప్పగించారు.కేంద్రం ఏర్పాటు చేసిన సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) ద్వారా ఫోన్లు రికవరీ చేశామని సీఐ జగదీష్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా తమ సెల్‌ఫోన్ పోగొట్టుకున్నా పోలీసు స్టేషన్ వరకు రావాల్సిన అవసరం లేదని, చోరీకి గురైనా సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలను పొందుపరుచాలని సూచించారు.

## సిసి రోడ్ల నిర్మాణంలో కాంట్రాక్టుల ఇష్టారాజ్యం

- కనీసం పట్టించుకోని సంబంధిత అధికారులు

వాజేడు, విశాలభారతి:



మండల పరిధి పలు గ్రామ పంచాయతీ లలో ప్రభుత్వం మంజూరు చేసిన సిసి రోడ్లు నిర్మాణంలో నాణ్యత లోపించింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు ఇస్తారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గ్రామాలలో సిసి రోడ్లు పోసిన రెండు రోజులకే రోడ్డు నిర్మాణంలో నాణ్యత లేకపోవడం వల్ల రోడ్లు పగిలిపోయి దర్శనమిస్తున్నాయి. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడం కాంట్రాక్టర్లు ఇష్టం వచ్చినట్లుగా రోడ్డు నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారుల చేతివాటం ఈ నిర్లక్ష్యానికి నిదర్శనమని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు సిసి రోడ్ల నిర్మాణంలో తగిన నాణ్యతతో కూడిన రోడ్లు నిర్మించాలని ప్రజలు కోరుకుంటున్నారు.



## ఏప్రిల్ 27న చలో వరంగల్ జయప్రదం చేయండి

- బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయండి
- ఇబ్రహీంపట్నం మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చిలకల బుగ్గ రాములు పిలుపు

ఇబ్రహీంపట్నం,విశాల భారతి:

బీఆర్ఎస్ 25వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభను విజయవంతం చేయాలని ఇబ్రహీంపట్నం మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చిలకల బుగ్గ రాములు అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నం పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో చిలుకల బుగ్గ రాములు తో పాటుగా ఇబ్రహీంపట్నం మాజీ ఎంపీపీ పి. కృపేష్ , మండల్ ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి భాస్కర్ రెడ్డి , బిఆర్‌ఎస్వీ నియోజకవర్గం అధ్యక్షుడు నిట్టు జగదీశ్వర్ పాల్గొని ప్రసంగించారు. మండలం నుండి 2వేల మందిని తరలించే విధంగా కార్యకర్తలు కృషి చేయాలని వారు కోరారు. బీఆర్ఎస్ పార్టీ ఏ కార్యక్రమం తలపెట్టినా ఒక పార్టీ కార్యకర్త సైనికుల్లాగా సిద్ధంగా ఉండాలని, రెండు సంవత్సరాలు నిండక ముందే రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన హస్తవ్యస్థంగా మారిందని త్వరలోనే కేసీఆర్ మళ్ళీ అధికారంలోకి రానున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం బిట్ల వెంకట్ రెడ్డి, చీమల జగనాథం, పొన్నాల జగదీష్,గంగిరెడ్డి బల్వంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు..

## ఉప్పుల నర్సమ్మ భౌతికదేహానికి నివాళులు

పిఎసిఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్

దేవరుప్పుల, విశాలభారతి:



మండలకేంద్రానికి చెందిన ఉప్పుల నర్సమ్మ మరణించగా ఈ రోజు వారి ఇంటికి వెళ్ళి వారి భౌతిక దేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబసభ్యులకు ఆర్థిక సాయం అందజేసిన దేవరుప్పుల పిఎసిఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్. వారి వెంట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఉప్పుల సాయి ప్రకాష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చింత ఎల్లయ్య, రెడ్డిరాజుల కిష్టయ్య, తోటకూరి రమేష్, గోడిశాల శ్రీనివాస్, కారుపోతుల యాకస్వామి, గువ్వల ఎల్లయ్య,పత్తేపురపు శేఖర్, తోటకూరి మహేష్, కారుపోతుల సురేష్, బాషీపాక ప్రవీణ్,విజయ్,చింత ప్రవీణ్, తదుతరులున్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
బుధవారం,
16.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com
4
vishalabharathi Telugu Daily
GENERAL NEWS



# జర్నలిస్టు సోదరులకు పరామర్శ

**డోర్నకల్, విశాలభారతి:**

మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు చిత్తనూరి శ్రీనివాస్ మరిపెడ మండలం అబ్బాయి పాలెం, మున్సిపల్ కేంద్రం లోనీ జర్నలిస్టు సోదరులను పరామర్శించడం జరిగింది. ఇటీవల కిడ్నీ సంబంధిత వ్యాది తో బాధపడుతూ సర్జరీ చేయించుకొన్నా బషీపంగు వెంకన్నను, ఇటీవల బైక్ ప్రమాదానికి గురి అయినా జిల్లా టీయూడబ్ల్యూజె ఐజెయూ జిల్లా ఉపాధ్యక్షులు సీనియర్ జరలిస్ట్ జిన్నా లచ్చన్న, జరలిస్టులు మిత్రులను పరామర్శించిన జిల్లా టీడబ్ల్యూజెయూ అధ్యక్షులు చిత్తనూరి శ్రీనివాస్.ఈ సందర్భంగా మాట్లాడుతూ జర్నలిస్టు అనే వ్యక్తి సమాజంలో అహర్నిశలు కష్ట పడుతూ సమాజ శ్రేయస్సులో ప్రాముఖ పాత్ర వహిస్తూ, ప్రజలకు ప్రభుత్వనికి వారధిగా ఉంటూ సమాజ నిర్మాణం లో ప్రముఖపాత్ర వహిస్తాడని తెలిపారు. అలాంటి విలేకర వృత్తి లో ఉండి విధి నాటకంలో ప్రమాదలకు,అనారోగ్య సమస్యలతో పోరాటలు చేస్తూ సమాజ శ్రేయస్సుయే తమ జీవిత లక్ష్యం పెట్టుకొని జీవిస్తున్న జర్నలిస్టులనీ తెలిపారు. తమ మిత్రులు త్వరగా కోలుకోవాలని ఆ భగవంతుడి వేడుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ మెంబెర్ గంధసిరి రవి, మరిపెడ ప్రెస్ కల్బ్ అధ్యక్షులు మూడు శ్రీకుమార్ చౌహాన్, ప్రధాన కార్యదర్శి మొగలాగని మహేందర్, రేఖ అశోక్, షానవాజ్, గండి నాగరాజు, బోడ శ్రీను, ఆఫ్జాల్ ఖాన్, ఉమేష్, రాజు,తదితరులు హాజరయ్యారు.

## చింతల రాజేందర్ కు దళిత రత్న

**సికింద్రాబాద్, విశాలభారతి:**

పార్సిగుట్టకు చెందిన చింతల రాజేందర్ కు దళిత రత్న అవార్డు లభించింది. దీంతో సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఆదం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ప్రభుత్వం నిర్వహించిన అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా దళిత రత్న అవార్డులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనిల్, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.




# ఉగాది పురస్కారాన్ని అందుకున్న గిలకత్తుల శ్రీనివాస్

**- సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎన్ వి రమణ చేతులమీదుగా అవార్డుల స్వీకరణ**

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**



విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రాల ఉత్తమ జర్నలిస్టుల అవార్డులు 2024 2025 ప్రధానం వ్యవస్థాపక అధ్యక్షులు మేడవరపు రంగనాయకులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సుప్రీంకోర్టు 48 వ మాజీ చీఫ్ జస్టిస్ ఎన్ వి రమణ హాజరైనారు. ఈ సందర్భంగా ఎన్ వి రమణ మాట్లాడుతూ ఒకప్పుడు నేను కూడా పత్రికా విలేకరిగా పని చేశాను, తాను జర్నలిస్టుగా పనిచేసిన రోజులను వారు నెమరు వేసుకున్నారు. విలువలతో కూడిన పాత్రికేయులకు సమాజంలో ఎప్పటికీ గౌరవం ఉంటుందని వారు అన్నారు. పాత్రికేయ రంగంలో ఉన్న అపోహలను తొలగించవలసిన అవసరం మన అందరి పైన ఉందని వారు గుర్తు చేశారు. నిజాలను నిక్కచ్చిగా, నిర్భయంగా రాయగలిగినప్పుడే పాత్రికేయులకు సమాజంలో ఒక మంచి గుర్తింపు లభిస్తుందని వారు తెలియజేశారు. వివిధ రంగాలలో ఉగాది ఉత్తమ అవార్డును అందుకున్న పాత్రికేయ మిత్రులందరికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఉగాది అవార్డును అందుకున్న గిలకత్తుల శ్రీనివాస్ ఈ సందర్భంగా మాట్లాడుతూ పాత్రికేయ రంగంలో ఉత్తమ జర్నలిస్టులుగా గుర్తించి అవార్డులను ఎంపిక చేసిన తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మేడవరపు రంగనాయకుల కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ అవార్డుతో పత్రికా రంగంలో ఎంతో ఉత్సాహంగా పని చేయడానికి ఉపయోగపడుతుందని వారు అభిప్రాయపడ్డారు. గిలకత్తుల శ్రీనివాస్ ను మెమెంటో, ప్రశంసా పత్రం, రూ. 5000/ నగదు బహుమతి, శాలువాతో సత్కరించారు. అవార్డు అందుకున్న శ్రీనివాసును, గడ్డం సత్యనారాయణ, బంధువులు, మిత్రులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నిర్మాత కంచర్ల అచ్యుతరావు, నిజాం బాబా, శ్యాముల్ రెడ్డి, సురేష్, శిల్పా ప్రియాంక, ఆనం చిన్న, తెలుగు జర్నలిస్టుల సంఘం తెలంగాణ అధ్యక్షుడు గజ్జల శ్రీనివాస్, సుబ్బారావు, రామారావు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ

**నూతనకల్, విశాలభారతి:**

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు దాతలు పరీక్షా సామాగ్రి పంపిణీ చేయడం అభినందనీయమని ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వాంకుడోత్ వెంకన్న నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని జాల్ తండా, సోమ్లాతండా, బక్క హేమ్లా తండా, టీక్య తండా ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు దాత కట్టంగూర్ తాసిల్దార్ ప్రసాద్ నాయక్ ఆర్థిక సాయంతో తెలంగాణ బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘ్ ఆధ్వర్యంలో పరీక్ష ఫ్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన తండాల్లోని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి గిరిజన ఉద్యోగులు, నాయకులు చేయూతనందియ్యాలని కోరారు. రానున్న విద్యా సంవత్సరంలో తండాల్లోని పాఠశాలల విద్యార్థులకు నోటు పుస్తకాలు, బ్యాగులు, షూ, బెల్టులతో పాటు పాఠశాల అభివృద్ధిలో ప్రతి గిరిజన ప్రభుత్వ ఉద్యోగి భాగస్వామి కావాలని కోరారు. తన సొంత ఖర్చులతో జాల్ తండా పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మించిన దాత తహసిల్దార్ దేశ్య నాయక్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి గుగులోతు కృష్ణ నాయక్, కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు మూడ్ శంకర్ నాయక్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గుణగంటి శ్రీనివాస్, సామ ఇంద్రారెడ్డి, మన్నెం శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



# సంకీర్తన సంప్రదాయమే సనాతన ధర్మానికి ఊపిరి

**మద్దూర్, విశాలభారతి:**

మద్దూర్ మండల కేంద్రం కొడంగల్ నియోజకవర్గంలో శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం"ను అన్నమయ్య కళాక్షేత్ర పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విజయశంకర స్వామి సందర్శించారు.ఆలయ అధికారులు మరియి భక్త బృందాలు విజయశంకర స్వామి వారికి గౌరవ స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులను ఉద్దేశించి విజయశంకర స్వామి అనుగ్రహ భాషణం చేసి,మే 7 వ తేదీన హైదరాబాదులోని ఇందిరా పార్కు వద్ద జరగనున్న హైందవ భక్తి కళా సమ్మేళనం ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చి ప్రచార గోడపత్రికలను ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి ఎన్నో సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ సంప్రదాయాలను గౌరవిస్తూ సనాతన ధర్మానికి తమ వంతు కృషి చేస్తున్నారు అని అన్నారు. కార్యక్రమంలో జై భారత్ జైహో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మేశ్వర్,జై భారత్ నాయకులు గ్రామ భజన బృంద సభ్యులు మెట్ల వెంకటప్ప,దాసరి భాస్కర్ పోస్ట్,విజయ్ రెడ్డి టీచర్,మిట్టే చంద్రశేఖర్,మాసని శ్రీనివాస్,సిపిరి గోపాల్,హనుమ నాయక్ ,పల్లె శ్రీనివాస్,సిపిఎం హనుమంతు తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్

**తుంగతుర్తి,విశాలభారతి:**

తుంగతుర్తి మండలంలోని సంగం గ్రామంలో FSCS LTD ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు సెంటర్ ని తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు లేకుండా చూడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, DCCB డైరెక్టర్ మరియు FSCS చైర్మన్ గుడిపాటి సైదులు మార్కెట్ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న గ్రామ శాఖ ఏశమల్ల వెంకన్న మండల పార్టీ ఉపాధ్యక్షుడు మారగాని వెంకటయ్య డైరెక్టర్ బిక్షం రెడ్డి గౌతమ్ రెడ్డి వెంకట్ రెడ్డి మాజీ ఉపసర్పంచి జటంగి అనిత లింగయ్య కలకోట మల్లేష్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జటంగి మహేందర్ బండారు సావిత్రమ్మ ప్రవీణ్ మరియు కార్యకర్తలు, రైతులు, హమాలీలు తదితరులు పాల్గొన్నారు.



# సిసి రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

**కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి**

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి నేడు డివిజన్లోని మహా గాయత్రీ నగర్ లో జరుగుతున్న నూతన సిసి రోడ్ల నిర్మాణ పనులను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సిసి రోడ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా ఎప్పటికప్పుడు అధికారుల పర్యవేక్షణ ఉండాలని, అదేవిధంగా రాబోవు కాలంలో కాలనీవాసులకు ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని కార్పొరేటర్ తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ మల్కాజ్గిరి పార్లిమెంట్ జాయింట్ కన్వీనర్ బండారి భాస్కర్ , డిఇ దామోదర్ , ఏ ఇ హేము నాయక్ , వర్క్ ఇన్స్పెక్టర్ సురేష్ , గాయత్రి కాలనీ అధ్యక్షులు దేవ్ సింగ్, ప్రధాన కార్యదర్శి లింగం , సంక్షేమ సంఘం సభ్యులు భగవత్ గౌడ్ , శ్రీనివాస్ యాదవ్ , బలరాం రెడ్డి , ప్రవీణ్ , వేణుగోపాల్ రెడ్డి , కాలనీవాసులు పాల్గొన్నారు.



# 16న జరిగే ధర్నా విజయవంతం చేయండి..

**కాంట్రాక్టు అధ్యాపకులు**

**విశాలభారతి, ఓయూ :**

కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల JAC పిలుపు మేరకు బుధవారం ఓయూ పరిపాలనా భవన్ ఎదుట ధర్నా నిర్వహించారు.12 యూనివర్సిటీలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్లతో ఇందిరాపార్క వద్ద 16న, ధర్నా చౌక్ దగ్గర మహాధర్నా నిర్వహిస్తున్నాట్లు తెలిపారు. తెలంగాణ 12 ప్రభుత్వ యూనివర్సిటీల కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫసర్స్ ఈ మహాధర్నాలో భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల జేఏసీ నేతలు మాట్లాడుతూ. 12 యూనివర్సిటీల వీసీలకు 19 ఏప్రిల్ నుండి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు తెలిపారు. నేడు ధర్నాచౌజ్ ఇందిరా పార్క్ దగ్గర జరిగే మహా ధర్నాలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు ప్రజాసంఘాల ప్రతినిధులు మేధావులు పాల్గొని ప్రసంగించి మా డిమాండ్కు మద్దతు తెలుప తెలుపుతారని తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ధర్మతేజ, డాక్టర్ పరశురాం, డాక్టర్ ఉపేందర్, డాక్టర్ కుమార్, డాక్టర్ విజయేందర్ రెడ్డి, డాక్టర్ ఓ కృష్ణయ్య, డాక్టర్ తిరుపతి, డాక్టర్ పాండయ్య, డాక్టర్ తాళ్లపల్లి వెంకటేశ్వర్లు, డాక్టర్ రేష్మా రెడ్డి, పాల్గొన్నారు.

# పరంజ్యోతికి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ చోటు

**కూకట్ పల్లి, విశాలభారతి:**



కూకట్ పల్లి నియోజకవర్గం బాలానగర్ చెందినకు 39 ఏళ్ల ఎం.జె. పరంజ్యోతి అద్భుతమైన సంగీత ప్రదర్శనతో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో స్థానం సంపాదించి అరుదైన ఘనత సాధించారు. డిసెంబర్ 1న విజయవాడలోని హల్లెల్ మ్యూజిక్ స్కూల్ లో లీడ్ మేనేజర్ ఆగస్టీన్ డాండింగి వేణుగోపాల్ నేతృత్వంలో ఏకంగా 1046 మంది కళాకారులు ఏకకాలంలో శంకరాభరణం రాగాన్ని మొత్తం పూర్తి మూడు తాళాల్లో గంట పాటు ఆలపించి ఈ అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని స్వయంగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ న్యాయనిర్ణేత రిచర్డ్ విలియమ్స్ స్టెన్నింగ్ పరిశీలించి ధృవీకరించారు. ఈ ఘనత సాధించినట్లు అధికారిక ధృవీకరణ డిసెంబర్ 9, 2024న ప్రకటించారు. దీనికి సంబంధించి మంగళవారం హైదరాబాద్ లోని మణికొండలోని ది లైఫ్ చర్చ్ లో బహుమతి పురస్కార కార్యక్రమం అధికారికంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పరంజ్యోతి ఆనందం వ్యక్తం చేస్తూ ఈ రికార్డు తన నిజమైన విజయం అని, తన కృషి పట్టుదల మరియు సంగీతం పట్ల అంకితభావానికి నిదర్శనమని అన్నారు.ఈ అద్భుతమైన కార్యక్రమం కోసం తాను గత రెండేళ్లుగా సన్నద్ధమవుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రదర్శన జరిగిన రోజే పూర్తి రికార్డింగ్ను గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రధాన కార్యాలయానికి పంపినట్లు పరమజ్యోతి వివరించారు. క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం, వారి రికార్డుకు సంబంధించిన అధికారిక ధృవీకరణ డిసెంబర్ 9, 2024న వారికి అందింది. ఈ అసాధారణ విజయం ఎం.జె. పరంజ్యోతికి వ్యక్తిగత గుర్తింపును తీసుకురావడమే కాకుండా, ఈ ప్రాంతంలోని గొప్ప సంగీత ప్రతిభను, వారసత్వాన్ని ప్రపంచానికి చాటి చెప్పింది. పరంజ్యోతి యొక్క అంకితభావం మరియు 1046 మంది కళాకారుల యొక్క సమిష్టి కృషి సంగీత చరిత్రలో ఒక కొత్త మైలురాయిని సృష్టించింది, తద్వారా వారికి ప్రతిష్టాత్మకమైన గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ లో సముచిత స్థానం లభించింది.

# జనతా గ్యారేజ్ మెకానిక్ సెంటర్‌ను ప్రారంభం

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీలో ఔటర్ రింగ్ రోడ్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన జనతా గ్యారేజ్ మెకానిక్ సెంటర్ ను ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నాయకులు దండెం రాంరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ తాజా మాజీ కౌన్సిలర్ దండెం కృష్ణ రెడ్డి , మహమ్మద్ కలీమ్ , పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ బిఆర్ఎస్ పార్టీ మైనారిటీ ప్రెసిడెంట్ ఎండీ.ఇర్ఫాన్ , పాషా, హుస్సేన్, షరీఫ్, సలీమ్, షాపుద్దీన్, సల్మాన్, జానీ, సైదా తదితరులు పాల్గొన్నారు.



విశాల భారతి
తెలుగు దిన పత్రిక
బుధవారం,
16.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com
5
vishalabharathi Telugu Daily
GENERAL NEWS



# నేత్రదానం మహాదానం

ఆమనగల్లు,విశాలభారతి:

జిల్లా అంధత్వ నివారణ సంస్థ రామ్ రెడ్డి లయన్స్ ఐ హాస్పిటల్ లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు వారి సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని నేత్ర వైద్యులు ఎం చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేత్రదానం చేయండి చిరంజీవిలు కండి ప్రతి ఒక్కరూ నేత్రదానం చేయడం వల్ల మరో ఇద్దరికి కంటి చూపు అందించిన వారు అవుతారని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ తమ కళ్ళను శుచి శుభ్రత పాటించాలని 50, 60 మధ్య వయస్కులు మంచి పోషక పదార్థాలు తీసుకుంటే కంటి చూపు మందగించదని ఆయన అన్నారు. కంటి సమస్యలు ఉన్నవారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నేత్ర వైద్యులను ఏం చంద్రశేఖర్ ను సంప్రదించాలని ఆయన అన్నారు. నేత్రదానంపై యువతి యువకులకు అవగాహన కల్పిస్తామని ప్రతి ఒక్కరూ నేత్రదానం చేసేలా ముందుకు రావాలని ఆయన అన్నారు. ఈ శిబిరంలో 72 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 40 మందిని కంటి ఆపరేషన్ నిమిత్తం రామ్ రెడ్డి లయన్ హాస్పిటల్ కు తరలించినట్లు క్లబ్ పిఆర్ఓ పాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్యులు ఎం చంద్రశేఖర్, క్లబ్ అధ్యక్షులు పసుల లక్ష్మారెడ్డి, కార్యదర్శి దోనాదుల మహేష్, క్లబ్ పిఆర్ఓ పాషా ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీసులకు సన్మానం



సికింద్రాబాద్,విశాలభారతి:

హనుమాన్ జయంతి సందర్భంగా పార్సిగుట్ట లో నిర్వహించిన శోభ యాత్ర విజయవంతం చేయుటకు సహకరించిన వా రా సిగూడా పోలీస్ స్టేషన్ అధికారులు సర్కిల్ ఇన్స్పెక్టర్ రమేష్ గౌడ్, ఎస్సై లు సుధాకర్ , మల్లికార్జున్ ఇతర ఆఫీసర్లను బీజేవైఎం బౌద్ధ నగర్ డివిజన్ అధ్యక్షుడు లడ్డు ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు.

# అధికారులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశం

- ఇందిరమ్మ ఇండ్లపై మున్సిపల్ కమీషనర్లు, ఎంపీడీవో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి
- త్రాగునీరు, రాజీవ్ యువ వికాసం స్కీం, ఎల్ఆర్ఎస్, స్టిచ్చింగ్ ఆఫ్ స్కూల్ యూనిఫాంలపై సమీక్ష సమావేశం
- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సీ. నారాయణ రెడ్డి

ఇబ్రహీంపట్నం, విశాలభారతి:



రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సి .నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతీమా సింగ్, లతో కలిసి ఇందిరమ్మ ఇండ్లు, త్రాగునీరు, రాజీవ్ యువ వికాసం స్కీం, యల్ఆర్ఎస్, స్టిచ్చింగ్ ఆఫ్ స్కూల్ యూనిఫాంలపై మున్సిపల్ కమీషనర్లు, యంపిడిఓ, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ ఇందిరమ్మ ఇండ్లపై మాట్లాడుతూ.. మున్సిపల్ కమీషనర్లు, ఎంపీడీవోలు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఈ డ్రైవ్ లో భాగంగా మే 5 వరకు లబ్దిదారులను సెలక్షన్ ఫైనల్ చేయాలన్నారు. దీని కోసం నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్లను నియమించడం జరిగిందన్నారు. రేపటి లోక నియెజవర్గం ప్రకారం ఎల్జిబిలిటీ క్రైటీరియా ఫైనల్ చేయాలని అధికారులకు ఆదేశించారు. ఎలిజిబిల్ క్రైటీరియా ప్రకారం అదనంగా 20 శాతం లబ్దిదారుల డేటాను అధికారుల వద్ద ముందస్తుగా తయారు చేసుకోని అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఏప్రిల్ 20 లోపు లిస్ట్ ఫైనల్ చేయాలని తెలిపారు. గెజిటెడ్ అధికారులు సూక్‌టనీ విధానంలో 21 ఏప్రిల్ నుండి 30 ఏప్రిల్ వరకు ఎంక్వాయిరీ పూర్తిచేయాలని గెజిటెడ్ అధికారులకు ఆధేశించారు. మున్సిపల్ కమీషనర్లు, ఏంపిడిఓలు ఫైనల్ లిస్ట్ ను కలెక్టర్ లాగిన్ లోకి పూష్ చేయాలని, ఆ తరువాత మే 5న జిల్లా ఇంచార్జీ మంత్రికి అందజేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో ప్రతి అధికారు ఫీల్డ్ లోకి వెళ్లి ఎంక్వాయిరీ చేయాలని, 17 నుండి 20 వరకు ఇందిరమ్మ కమిటీల ద్వారా వచ్చిన లిస్ట్ ని వెరిపై చేసుకోవాలని అన్నారు. బెనిఫిషరీ విషయంలో అవకతవకలు జరుగకుండా చూడాలని అవకతవకలు జరిగినట్లు వస్తే అధికారులపై చర్యలు ఉంటాయన్నారు.

**రాజీవ్ యువ వికాసం**

బిసి, యస్ సి, యస్టీ, మైనారిటీ వెల్ ఫ్వేర్ లో వచ్చిన అప్లికేషన్ల గడువు నేటి తో పూర్తయిందన్నారు. యంపిడిఓ, మున్సిపల్ కమీషనర్లు వార్డ్, విలేజ్ వైజ్ గా సార్టౌట్ చేసి, వాటిని 1 నుండి 50, 50 నుండి 100, 100 నుండి 150 సమకూర్చుకోవాలన్నారు. వెరిఫైయర్ కి సంబంధించి గంట ఓరియంటేషన్ నిర్వహించి, జీవో, అప్లికేషన్లపై అవగాహణ కల్పించాలన్నారు. వీటిని పరిష్కరించడానికి 16 తారీఖు నుండి 17 తారీకు వరకు ఎంక్వాయిరీ స్టార్ట్ చేయాలన్నారు. ఈ నెల చివరి వరకు వెరిఫికేషన్ పూర్తి కావాలని, డెడ్‌లైన్ ఏప్రిల్ 30 అని అన్నారు.



## బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలి

- శ్రీనివాస్ గౌడ్

ఆమనగల్లు,విశాలభారతి:

ఆప్రజస్వామిక నిర్ణయాలు తీసుకుంటున్న బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని టిపిసిసి సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మంగళవారం అమనగల్లు మండల కేంద్రంలో రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న జై బాపు జై భీమ్ జై సంవేదాన్ పాదయాత్ర ముఖ్య నాయకులతో కలిసి శ్రీనివాస్ గౌడ్ విస్తృతంగా చేపట్టారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమాన్ని ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు వివరిస్తూ వెళుతుంటే ప్రజలనుండి మంచి స్పందన వచ్చిందని,వాస్తవాలను ప్రజలకు తెలియ చెప్పేందుకే జై బాపు జై భీం జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమం చేపట్టామన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజలకు అందించిన అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరవేసే విధంగా, అదే విధంగా దేశంలో బిజెపి ప్రభుత్వం ఏ విధంగా రాజ్యాంగాన్ని అవమానిస్తూ కించపరుస్తూ వ్యవస్థలన్నింటిని నిర్వీర్యం చేస్తూ, ఆప్రజస్వామిక నిర్ణయాలు తీసుకుంటున్న బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని,అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్క కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఈ కార్యక్రమంలో పాల్గొని పార్టీ ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని అన్నారు.



## గిట్టుబాటు ధర కల్పించేందుకే ధాన్యం

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, విశాల భారతి:

కొనుగోలు కేంద్రాలు రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించేందుకే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. మంగళవారం తలకొండపల్లి మండలం పడకల్లు గ్రామంలో ప్రొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏఎంసీ చైర్మన్ గీతా నరసింహ, పిఎసిఎస్ కేశవరెడ్డి మండల అధ్యక్షులు డోకూరు ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. అర్హులైన నిరుపేదలందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చెప్పారు. మంగళవారం తలకొండపల్లి మండలం వెంకటాపూర్ తండా,పెద్దూరు తండా, దేవుని పడకల్లు, కడ్తాల్ ఆయా గ్రామాలలో జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాలను ఎగురవేసి మాట్లాడుతూ రాజ్యాంగాన్ని అవమాన పరిచేల వ్యాఖ్యలు చేస్తున్నారని వారి వ్యాఖ్యలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు.




## కాంగ్రెస్ పార్టీలో బీఆర్ఎస్ నాయకులు చేరిక

బాల్కొండ,విశాలభారతి:

ఏర్గట్ల మండల కేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యమకారులు మాజీ బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రాజారపు సహదేవ్, ఇబ్రహీంపట్నం చిన్న భూమన్న బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.రాష్ట్రంలో ప్రజారంజక ప్రజాపాలనకు ఆకర్షితులై నియోజకవర్గంలో ముత్యాల సునీల్ కుమార్ నాయకత్వంలో పని చేయడానికి కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## దొడ్డి కొమరయ్య చిత్ర నిర్మాణం అభినందనీయం

- పేటలో సాయుధ పోరాట వీరులను యాది చేసుకున్న చిత్ర యూనిట్
- భీంరెడ్డి నర్సింహ్మారెడ్డి విగ్రహానికి నివాళులర్పించిన ప్రజా సంఘాల నాయకులు

సూర్యాపేట,విశాలభారతి:

తెలంగాణ సాయుధ పోరాటమే ఇతివృత్తంగా దొడ్డి కొమరయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని చిత్ర నిర్మాణం చేయడం అభినందనీయమని ప్రముఖ వైద్యులు, ఉండ్రుగొండ దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ వూర రామ్మూర్తియాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లులు అన్నారు. దొడ్డి కొమరయ్య జీవిత చరిత్ర చిత్ర నిర్మాణంలో భాగంగా మంగళవారం చిత్ర యూనిట్ ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి భీంరెడ్డి నర్సింహ్మారెడ్డి విగ్రహం వద్ద చిత్ర పోస్టర్ ను ఆవిష్కరించి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాట రథసారధి భీంరెడ్డి నర్సింహ్మారెడ్డి అని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధులను గుర్తు చేస్తూ దొడ్డి కొమరయ్యపై చిత్ర నిర్మాణం చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. దొడ్డి కొమరయ్య మరణం చాకలి ఐలమ్మ పొలంతో ముడిపడి ఉందని ఆమె ధాన్యం రాశులకు యాదగిరిరావు, క్రిష్ణమూర్తి దళాలు కాపాలా కాశాయని గుర్తు చేశారు. చాకలి ఐలమ్మ ధాన్యంకు కాపాలా కాసే క్రమంలో తుపాకీ కాల్పులకు దొడ్డి కొమరయ్య అక్కడికక్కడే ప్రాణాలు వదిలిన ఆనాటి ఘట్టాలను తెరకెక్కించడం అభినందనీయమన్నారు. దొడ్డి కొమరయ్య చిత్రాన్ని ప్రజలంతా ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సినిమా డైరెక్టర్ సేనాపతి, ప్రజా సంఘాల నాయకులు బొమ్మిడి లక్ష్మినారాయణ, చల్లమల్ల నర్సింహ్మ, భూపతి నారాయణ, మల్లు నాగార్జున్ రెడ్డి, కొత్తపల్లి శివకుమార్, ముల్కలపల్లి రాములు, తప్పెట్ల శ్రీరాములు, జె.నరసింహరావు, వజ్జ వీరయ్య, కొడి సైదులు, కోడి లింగయ్య, బయ్య మల్లికార్జున్, మన్నె యాదగిరి ఉన్నారు.



## 25 సం.ల తర్వాత స్నేహితుల అపూర్వ కలయిక

- పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం.

విశాలభారతి,భీమదేవరపల్లి :

సరిగ్గా 25 సంవత్సరాల క్రితం 199899 లో జెడ్పిహెచ్ఎస్ ముల్కనూర్ లో పదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు 25 సం.ల సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మిత్రులందరు సుదీర్ఘకాలం తర్వాత కలుసుకొని, తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ, తమ అనుభవాలను పంచుకున్నారు. వివిధ రంగాల్లో స్థిరపడ్డ వారు, తమకు విద్య బుద్ధులు నేర్పి ఉన్నత స్థానంలో నిల్చోపెట్టిన తమ గురువులకు పాదాభివంధానం చేస్తూ వారిని ఆత్మీయంగా సన్మానించారు. తమ స్నేహితులతో మాట ముచ్చట, ఆట పాటలతో సరదాగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుదర్శన్ రెడ్డి, ఆంజనేయులు, కృష్ణమూర్తి, నాగేశ్వర్, రాజన్న, చంద్రయ్య, మహిపాల్ విద్యార్థులు దేవరాజు కిరణ్ కుమార్, మాడుగుల నవీన్ కుమార్, మాడుగుల ప్రసాద్, బైరి రాంబాబు, ఎర్రోజు శంకరచారీ, రజినికాంత్, ప్రేంసాగర్, శ్రవణ్, అనిత, మూల రాధిక, సంధ్య, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



## రాదు అనుకున్న తెలంగాణను సాధించుకున్నాం

- కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చి మోసం చేసింది
- తిరిగి సొంత గూటికి చేరిన నాయకులు

బాల్కొండ,విశాలభారతి:

బాల్కొండనియోజకవర్గంలోని మెండోరా మండలం సొన్ పేట్ గ్రామ మాజీ సర్పంచ్ గోలి ప్రకాష్, దూదిగం మాజీ సర్పంచ్ పసుల శ్రీనివాస్ అలాగే వారి అనుచరులు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలో తిరిగి సొంత గూటియైన బీఆర్ఎస్ పార్టీలో చేరారు.వారికి ఆయన కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాదు అనుకున్న తెలంగాణ ను సుదీర్ఘ పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించుకున్నామని తెలిపారు. 14 ఏండ్ల ఉద్యమంలో ఎన్నో ఒడిదుడుకులు తట్టుకొని సబ్బండ వర్ణాలను ఒక్కతాటిపై తీసుకు వచ్చి రాష్ట్రాన్ని సాధించిన నాయకుడు కేసీఆర్ అని గుర్తు చేశారు.బాల్కొండ నియోజకవర్గంలో మోతె, బుస్సాపూర్ లాంటి అనేక గ్రామాలు ఉద్యమ స్పూర్తిని రగిలిస్తూ ఉద్యమనికి అండగా నిలబడ్డాయని అన్నారు. మా తండ్రి స్వర్గీయ వేముల సురేందర్ రెడ్డి కేసీఆర్ వెంట ఉద్యమ ప్రస్థానంలో మొదటి నుండి నడిచారని తెలిపారు.వచ్చిన తెలంగాణను గత 10 ఏండ్లలో అనేక రంగాలలో కేసీఆర్ దేశంలోనే అగ్రగామిగా నిలిపారని అన్నారు.మొన్నటి ఎన్నికల్లో స్వల్ప తేడాతో మనం అధికారం కోల్పోయినమని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి అనేక హామీలు ఇచ్చి ప్రజలను నమ్మించి మోసం చేసి గద్దెనెక్కాడని అన్నారు.ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం పై పూర్తిగా భ్రమలు తొలిగిపోయాయని అన్నారు.ప్రజలు,నాయకులు,కార్యకర్తలు మళ్ళీ బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని,అందుకే పార్టీలో చేరుతున్నారు.పాత వారు,కొత్తగా పార్టీలో చేరుతున్న వారు గ్రామంలో ఒకరికొకరు సమన్వయం చేసుకొని పార్టీ పటిష్ఠతకు కృషి చేయాలని కోరారు.అందరం కలిసికట్టుగా పనిచేసి మోసపూరిత కాంగ్రెస్ ను గద్దె దించి తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో తిరిగి మళ్ళీ మనం అందరం భాగస్వామ్యం కావాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ వేల్పూర్ మండల అధ్యక్షులు శేఖర్ రెడ్డి, మాజీ ఎంపిపి కమలాకర్,మాజీ ఎంపిటిసి దేవేందర్,బాబా,మాజీ సర్పంచ్ లు నాగుల నర్సయ్య,గంగారెడ్డి, రాజారెడ్డి,గంగారెడ్డి ,యాదగిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

బుధవారం,
16.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com





# రైతులు వరి ధాన్యం కొనుగోలు సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలి

- హనుమకొండ జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి

**విశాలభారతి,భీమదేవరపల్లి :**
మండలంలోని ముల్కనూర్ సహకార గ్రామీణ పరపతి సంఘం పరిధిలోని పార్ బాయిల్డ్ రైస్ మిల్ ఆవరణలో మంగళవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ముల్కనూరు సహకార సంఘాన్ని సందర్శించారు. రైతులు పరస్పర సహకారంతో ముల్కనూరు సంఘం అభివృద్ధి చెందుతున్న తీరును పరిశీలించారు. ఏ రైతు కూడా తన పంటని కనీస మద్దతు ధర కన్నా తక్కువకు అమ్ముకోవాల్సిన అవసరం లేకుండా దళారులు, మధ్యవర్థుల ప్రమేయం లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలు పనిచేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముల్కనూరు సహకార సంఘం ఉపాధ్యక్షుడు కడారి ఆదాం, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ మహేందర్, సప్లై ఆఫీసర్ కొమురయ్య, సంఘ జీఎం మారుపాటి రాంరెడ్డి, మండల నోడల్ అధికారి రవీంద్ర, సభ్యులు పాల్గొన్నారు.



# భూ భారతి చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట,విశాలభారతి:**
భూ భారతి నూతన రెవెన్యూ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పనకు అన్ని మండలాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహణకు షెడ్యూల్ తయారు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో మంగళవారం భూ భారతి నూతన రెవెన్యూ చట్టంపై అన్ని మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది, జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబుతో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ప్రతి మండలంలో భూ భారతి నూతన రెవెన్యూ చట్టంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహణకు షెడ్యూల్ రూపకల్పనతో పాటు అన్ని ఏర్పాట్లు చేయాలని తహశీల్దార్లను ఆదేశించారు. రాష్ట్రంలో భూభారతి చట్టాన్ని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి రోజు నుండి మొదలు పెట్టడం జరిగిందని, రెవెన్యూ సిబ్బంది అందరికీ ఈ చట్టంపై పూర్తి అవగాహన ఉండాలని ప్రతి రోజు ఒక 30 నిమిషాలు భూభారతి పోర్టల్ లో పొందుపరిచిన విషయాలను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి తహసిల్దార్ కార్యాలయంలో భూ భారతి చట్టం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి చట్టంపై ప్రజలకు సలహాలు, సూచనలు అందచేయాలని సూచించారు. కొత్తగా ఉద్యోగంలో చేరిన జూనియర్ అసిస్టెంట్లు బాగా పనిచేయాలని అందరూ యువకులే కావున రెవెన్యూ అంశాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యపేట ఆర్డీవో వేణుమాధవరావు,కోదాడ సూర్యనారాయణ, హుజూర్నగర్ శ్రీనివాసులు, కలెక్టరేట్ ఏఓ సుదర్శన్ రెడ్డి, సూపరింటెంట్లు సాయి గౌడ్, శ్రీనివాసరాజు,తహసిల్దారులు, డిప్యూటీ తాసిల్దార్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, జూనియర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



# జ్యోతిరావు పూలే పుస్తకాన్ని విడుదల చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్..

**విశాలభారతి, ఓయూ:**
మహాత్మా జ్యోతిబా పూలే పరిశోధనా కేంద్రం, ఉస్మానియా విశ్వవిద్యాలయం మహాత్మా జ్యోతిబా పూలే ఆలోచనలు మరియు తాత్వికత ఆలోచనలను ప్రచురించిన పరిశోధనలను తెలంగాణ రవాణా మరియు బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,ఓయూ వీసీ ప్రొ. కుమార్ లు, ఓయూలో ఇటీవల జరిగిన మహనీయుల జయంతి ముంగింపు కార్యక్రమంలో ఆవిష్కరించారు. మహాత్మా జ్యోతిబా పూలే ఒక మార్గదర్శక సామాజిక సంస్కర్త. అణచివేత, అన్యాయాలకు వ్యతిరేకంగా ఆయన అవిశ్రాంత పోరాటం చేశారని, మానవ నీతి మరియు విలువలపై ఆధారపడిన కొత్త సామాజిక వ్యవస్థను సృష్టించినట్లు చెప్పారు. మహాత్మా జ్యోతిబా పూలే ఆలోచనలు, పూలే యొక్క ముఖ్య అంశాలు సామాజిక న్యాయం, విద్య మరియు సమానత్వంపై దృష్టి పెడుతుందని, సామాజికఆర్థిక దృక్పథాలు, మహిళా విద్య, మతం, భారతీయ సమాజంలో సామాజిక న్యాయం యొక్క తత్వశాస్త్రం, సామాజిక , రాజకీయాలు, వ్యవసాయ సంక్షోభం, మానవ హక్కులు, కుల వ్యవస్థ మరియు అంటరానితనం వంటి అంశాలపై పూలే ఆలోచనలు వివరించారు. ఈ పుస్తకాలు 9 కేంద్రం విడుదల చేసినట్లు ISBN తో MJPRC పబ్లికేషన్స్ అందుబాటులో ఉంటాయి అన్నారు.మోనోగ్రాఫ్ సిరీస్ ,డాక్టర్ చాహల్, ప్రొ, సిహెచ్ శ్రీనివాస్,డా. చలమల్ల వెంకటేశ్వర్లు,వర్కింగ్ పేపర్ సిరీస్ డాక్టర్ కిషోర్ కుమార్ దాస్దా, వీరగోని శిరీష స్వల్పకాలిక పరిశోధన ప్రాజెక్టులు డా. అంజు లిస్ కురియన్, డాక్టర్ ఖాజా మోహినుద్దీన్ జె.డాక్టర్ శృతి,ఏడీటెడ్ వివరించారు. MJPRC & BC సెల్ డైరెక్టర్ డాక్టర్ జి. ఉపేందర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు, సెల్ డైరెక్టర్ డాక్టర్ జి. ఉపేందర్ మాట్లాడుతూ. రాబోయే కాలంలో మహాత్మా జ్యోతిబా పూలే పరిశోధనా కేంద్రం మహాత్మా జ్యోతిబా పూలే పై లోతైన అధ్యనం చేస్తుందని సెమినర్స్ , సైమ్పోసైసుమ్స్ , కాంఫరెన్సెస్ , వర్కింగ్ పేపర్ సిరీస్, స్వల్పకాలిక పరిశోధన ప్రాజెక్టులు, లెచ్చురెస్ మొదలగున్నవి చేస్తుందని వివరించారు

## వాల్ రైటింగ్ రాసిన ఎమ్మెల్యే వేముల




**బాల్కొండ,విశాలభారతి:**
ఈ నెల 27న వరంగల్ లో జరగబోయే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ భారీ బహిరంగ సభ విజయవంతం చేయాలని కోరుతూ బాల్కొండ నియోజకవర్గం కమ్మర్పల్లి మండల కేంద్రంలో రాస్తున్న వాల్ రైటింగ్ వద్ద మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆగి కాసేపు వాల్ రైటింగ్ రాశారు. ఈ సందర్భంగా వరంగల్ సభకు నియోజకవర్గం నుండి వేలాదిగా తరలివెళ్తామని, సభకు స్వచ్ఛదంగా తరలిరావడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే వేముల అన్నారు.

# మహిళలు సామాజిక సమానత్వం సాధించాలి

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

**సూర్యాపేట, విశాలభారతి:**
స్త్రీలకు అన్ని రంగాలలో సామాజిక సమానత్వం సాధించాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. మంగళవారం ఐద్వా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఐద్వా ఆధ్వర్యంలో చేపట్టిన పూలే అంబేద్కర్ యాదిలో మహిళ హక్కుల పరిరక్షణ యాత్ర హైదరాబాదులో ప్రారంభమై సూర్యాపేట జిల్లా కేంద్రంకు రాత్రి చేరుకుంది. ఈ యాత్రకు ఐద్వా సూర్యాపేట జిల్లా కమిటీ, ఎస్ఎఫ్ఐ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, కెవిపిఎస్ సంఘాల నాయకులు మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ఘన స్వాగతం పలికారు. మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం నుండి రైతు బజారులోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు, మానభంగాలు పెరిగాయని ఆరోపించారు.



విద్య, వైద్యం, ఉపాధి కల్పనలో ఇంకా స్త్రీలు వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని విమర్శించారు. మహిళలు, విద్యార్థులపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలను అరికట్టడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా వైఫల్యం చెందాయని అన్నారు. అంతకుముందు ప్రజానాట్యమండలి కళాకారులు ఆలపించిన గేయాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు తంగేళ్ల వెంకటచంద్ర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శిలు ఆశలత, భారతి, షబానా, స్వరూప, నర్మద, ఐద్వా జిల్లా కార్యదర్శి మద్దెన జ్యోతి, ఐద్వాజిల్లా నాయకురాలు పిండిగా నాగమణి, షేక్ ఖాజాబీ, రమాదేవి, చెరుకు ఏకలక్ష్మి, కొప్పుల రజిత, సృజన, మంగమ్మ, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు మల్లు నాగార్జున రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షాప్రధాన కార్యదర్శి ములకలపల్లి రాములు, ప్రజానాట్యమడలి జిల్లా కార్యదర్శి వేల్పుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



# చెక్కుల మంజూరు కోసం ఇంటి చుట్టూ తిప్పుకున్న చరిత్ర ప్రశాంత్ రెడ్డిది

- ప్రజా ప్రభుత్వంలో ఆడబిడ్డలు ఆనందంగా ఉన్నారు
- కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నిజాయితీగా ప్రజా సమస్యలను తీరుస్తున్నారు
- బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్

**బాల్కొండ,విశాలభారతి**
కళ్యాణలక్ష్మి,షాది ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కుల మంజూరు కోసం ఇంటి చుట్టూని యోజకవర్గం ప్రజలను తిప్పుకున్న చరిత్ర ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డిది అని బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రజలకు ఇచ్చే పథకాలలో కూడ కమిషన్లు తీసుకున్న చరిత్ర బీఆర్ఎస్ పార్టీది అని అన్నారు.ప్రజా పాలనలో ప్రజలు స్వేచ్ఛగా ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకుని లబ్ధి పొందుతున్నారని బ్రోకర్ వ్యవస్థ పూర్తిగా లేకుండా చేశామని,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు నిజాయితీగా ప్రజలకు సేవ చేస్తున్నారని తెలిపారు. బాల్కొండ ఎమ్మెల్యేగా గెలిచిన ప్రశాంత్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ ప్రోటోకాల్ గౌరవం ఇస్తే దాన్ని ఆయన కాపాడు కోవడం లేదని, ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందకుండా అదే పాత తరహా ఆహంకారాన్ని ప్రదర్శిస్తున్నారని అన్నారు.చెక్కుల గడువు ముగిసిపోతుంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయాలి అని హెచ్చరించినా ఎమ్మెల్యే అధికార దర్పాన్ని చూపించడం వల్ల నియోజకవర్గానికి మంజూరైన 513 కల్యాణ లక్ష్మి చెక్కుల గడువు ముగిసిపోతే ప్రభుత్వానితో మాట్లాడి వాటిని రెన్యువల్ చేయించడం జరిగిందని తెలిపారు.ఎమ్మెల్యేగా నేను చెక్కుల పంపిణీని బహిష్కరిస్తున్నట్లు ఒకసారి కలెక్టర్ కు,చెక్కుల గడువు ముగిసక పంచాయతీ సెక్రటరీల ద్వారా చెక్కులు పంచాలని ఆర్డీవోకు ఉత్తరం రాసి అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు.అదేదో పంచాయతీ సెక్రటరీల ద్వారా పంచాలని కలెక్టర్ కి ఉత్తరం రాస్తే ఆయన ఏదో ఒక నిర్ణయం తీసుకుని అమలుపరిచేవారు కదా అని ప్రశ్నించారు.బాల్కొండ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అవినీతిని కూకటివేల్లతో పెకిలించి వేసామని,ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలిగించకుండా పనిచేస్తున్నామని అన్నారు.ప్రజా ప్రభుత్వంలో ఆడబిడ్డలు ఆనందంగా ఉన్నారని తెలిపారు.గత ప్రభుత్వంలో రూ.6వేలు ఉన్న ఇసుకని ప్రభుత్వంతో మాట్లాడి సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు రెండు కొత్త ప్రభుత్వ పాయింట్ లను ఏర్పాటు చేయించి రూ.2,300 నుండి 3,300 మధ్య లోనే ఇసుకను అందించి సామాన్యులకు అండగా ఉంటున్నామని అన్నారు.ఇంకా వీలైనంత ప్రభుత్వ ఇసుక క్వారీలను ఏర్పాటు చేసి ఇసుక రేటును రాబోయే రోజుల్లో మరింత తగ్గించే ప్రయత్నం చేస్తామని అన్నారు. సామాన్యులు ఇల్లు నిర్మించుకునే కళకు అండగా ఉంటామని తెలిపారు.ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి సొంత మండలం వేల్పూర్ లో కూడా రానున్న రోజుల్లో ప్రభుత్వ క్వారీలకు అనుమతులు తీసుకొని వేల్పూర్, అమీనాపూర్,పడగల్, అంక్సాపూర్ గ్రామాలకు రూ.2,500 లోపు ఇసుకను అందిస్తామని అన్నారు.గతంలో ఇక్కడ 6వేల రూపాయల పైచిలుకు ధరకు ఇసుకను విక్రయించి బీఆర్ఎస్ పార్టీ నాయకులు వేల్పూర్ మండలాన్ని దోపిడీ చేశారని అన్నారు. నిజాయితీగా నిబద్ధతతో క్రమశిక్షణతో ప్రజాపాలన నడుస్తుందని ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డికి విమర్శించడం తప్ప ఏమి తెలియదని ఆయన ఎద్దేవ చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



# కొనుగోలు కేంద్రం ప్రారంభించాలని రైతుల ఆవేదన

**బాల్కొండ,విశాలభారతి:**
ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని భీమ్‌గల్ మండలం సిద్దపల్లి గ్రామం రైతులు భీమ్‌గల్ సొసైటీ చైర్మన్ శివసారి నర్సయ్యని కోరారు. ధాన్యం కోసి నెల రోజుల కావస్తున్న కేంద్రం ఇంకా ప్రారంభం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని చుట్టుపక్కల గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి అని తెలిపారు.వాతావరణం సరిగ లేకపోవడం ,ఎప్పుడైన వర్షం కురిస్తే తమ పంట ఎక్కడ నష్టపోతుందో అని వారి ఆవేదన వివరించారు.త్వరగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని కోరారు.

**సొసైటీ చైర్మన్ శివసారి నర్సయ్య వివరణ...**
హమాలీల కొరత వల్ల ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం కాస్త అలస్యం జరుగుతుందని అన్నారు.హమాలీలతో మాట్లాడడం జరిగిందని రెండు రోజుల్లో హమాలీలు రాగానే కోనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తామని తెలిపారు.

# నర్సరీని తొలగించాలని వినతి

- ఆమనగల్లు ఎంపీడీవో కు వినతి పత్రాన్ని అందించిన చెన్నంపల్లి గ్రామస్తుడు

**అమనగల్లు,విశాలభారతి:**
ఆమనగల్లు మండలం చెన్నంపల్లి గ్రామంలోని నర్సరీని తొలగించి వేరే ప్రదేశంలో ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన కలకొండ నరేష్ ఎంపీడీవో కి ఫిర్యాదు చేశారు. చెన్నంపల్లి గ్రామంలో తన ఇంటి పక్కన అధికారులు నర్సరీ నీ ఏర్పాటు చేశారని దానివల్ల పాములు తన ఇంట్లోకి ప్రవేశిస్తున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. పాత గోడలు,పాత ఇల్లు, ముళ్ళపొదలు, పాడుబడిన బావి తన ఇంటి పక్కన ఉండడంతో తన ఇంట్లోకి పాములు ప్రవేశిస్తున్నాయని, తన కుటుంబ సభ్యులు భయాందోళన గురి అవుతున్నారని అన్నారు. అధికారులు స్పందించి పాత గోడలను తొలగించి గ్రామ పంచాయతీ నర్సరీని వేరే ప్రాంతానికి తరలించాలని ఆయన తెలిపారు.




# ముగిసిన షటిల్ టోర్నమెంట్

**ఆమనగల్లు,విశాలభారతి:**
ఆమనగల్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి షటిల్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది.ఈ టోర్నమెంట్ విజేత గా అబా అధ్యక్షుడు కృష్ణ నాయక్,శ్రీకాంత్,టీమ్ ద్వితీయ బహుమతిగా ఎంగిలిప్రసాద్,జీకే, తిరుపతి టీమ్,మూడవ బహుమతిగా వేణు,జగన్ టీమ్, గెలుపొందారు.అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రారంభమైన షటిల్ టోర్నమెంట్ కు పది టీం లు పాల్గొన్నాయి. మూడు రోజుల పాటు ఎంతో ఉత్సాహంగా జరిగిన ఈ టోర్నమెంట్ కు షటిల్ క్రీడాకారులు ఎంతో అసక్తితో పాల్గొనడం జరుగుతుంది .క్రీడల వల్ల శారీరక మానసిక, ఆరోగ్య ప్రయోజనాలు పెంపొందుతాయి. ప్రతి వ్యక్తి శారీరక దృఢత్వం కోసం ఏదైనా క్రీడలపోటీల్లో పాల్గొని వారి ప్రతిభ కనబర్చాల్సిందిగా వారు తెలిపారు. ఆమనగల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు, గౌరవ అధ్యక్షులు టీచర్ వెంకటేష్ ,సలహాదారులు పర్వతాలు,ఉపాధ్యక్షుడు తిరుపతి,ప్రసాద్, కోశాధికారి రవి టీచర్ ,అబా సభ్యులు ,పంచాయితీ సెక్రటరీ జంగయ్య,జగన్,వేణు కాటన్ మిల్ ,మసన గిరి,ఏలే శివకుమార్,వేణు,దేవందర్, పవన్ ,శ్రీకాంత్,తెలిపారు.



cinema updates



## దంగల్ నటి లవ్ మ్యాటర్ రివీల్

బ్లాక్ బస్టర్ హిట్ దంగల్ మూవీతో బాలీవుడ్ బ్యూటీ ఫాతిమా సనా షేక్ మంచి గుర్తింపు సంపాదించుకున్న విషయం తెలిసిందే. ఆ సినిమాతోనే పాన్ ఇండియా లెవెల్ లో పాపులర్ అయిన ఆ నటి.. అంతకుముందు తెలుగులో కూడా నటించింది. రీసెంట్ గా తెలుగు నిర్మాతపై క్యాస్టింగ్ కౌచ్ ఆరోపణలు చేసి వార్తల్లో నిలిచింది. ఇప్పుడు ఆ బ్యూటీ.. తన ప్రేమ వ్యవహారంపై ఓపెన్ అయింది! దీంతో ఆమె ఇన్ స్టాగ్రామ్ పోస్ట్.. ఇప్పుడు ఫుల్ వైరల్ గా మారింది. అయితే చీరలతో తనకు పూర్తి స్థాయి ప్రేమ ఉందని రాసుకొచ్చింది. అదిరిపోయే శారీలో దిగిన పిక్స్ షేర్ చేయగా.. ఇప్పుడు ఇన్ స్టాలో ఆమె ఫోటోలు తెగ చక్కర్లు కొడుతున్నాయి. స్పెషల్ ఇయర్ రింగ్స్ పెట్టుకున్న అమ్మడు.. చీరలో ఇచ్చిన పోజులు వేరే లెవెల్ అని చెప్పాలి. ఒక్క ఫోటో ఓ రేంజ్ లో ఉందని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. చీరలో అదిరిపోయారని చెబుతున్నారు. అందమే అసూయ పడేలా ఉన్నారని అంటున్నారు. శారీ లవ్ అంటూ హ్యాష్ ట్యాగ్ ఇస్తూ లైక్స్ కొడుతూ సందడి చేస్తున్నారు. ఇక కెరీర్ విషయానికొస్తే.. మొట్టమొదటి ఫీల్డ్ మార్షల్ సామ్ మానెక్షా జీవితం ఆధారంగా రూపొందిన వార్ డ్రామా సామ్ బహదూర్ మూవీతో రీసెంట్ గా ప్రేక్షకుల ముందుకు వచ్చింది ఫాతిమా. ఇప్పుడు అనురాగ్ బసు దర్శకత్వం వహించిన మెట్రో ఇన్ డినోతో సందడి చేయనుందన్న విషయం అందరికీ తెలిసిందే. ఫాతిమాతోపాటు ఆదిత్య రాయ్ కపూర్, సారా అలీ ఖాన్, అనుపమ్ ఖేర్, నీనా గుప్తా, పంకజ్ త్రిపాఠి, కొంకణ సేన్ శర్మ, అలీ ఫజల్ తదితరులు నటిస్తున్న ఆ మూవీ జూలై 4వ తేదీన విడుదల కానుంది. అయితే మెట్రో ఇన్ డినో.. 2007లో రిలీజ్ అయ్యి సూపర్ హిట్ గా నిలిచిన లైఫ్ ఇన్ ఏ మెట్రోకు సీక్వెల్ గా ప్రేక్షకుల ముందుకు రానుంది.అయితే చైల్డ్ ఆర్టిస్ట్ గా కెరీర్ స్టార్ట్ చేసిన ఫాతిమా.. తొలుత ఇష్క్ లో బాలనటిగా కనిపించింది. ఆ తర్వాత కమల్ హాసన్ నటించిన చాచి 420 చిత్రంలో యాక్ట్ చేసింది. అనంతరం పలు సినిమాలు చేసిన ఆమె.. దంగల్ లో రెజ్లర్ గీతా ఫోగాట్ రోల్ పోషించి ఒక్కసారిగా లైమ్ లైట్ లోకి వచ్చిందనే చెప్పాలి. ఇప్పుడు పలు ప్రాజెక్టుల్లో అవకాశాలు అందుకుని దూసుకుపోతోంది ఫాతిమా.



## కుబేర ఫస్ట్ సింగిల్ ప్రోమో అదుర్స్

శేఖర్ కమ్ముల డైరెక్షన్ లో కోలీవుడ్ స్టార్ ధనుష్ హీరోగా వస్తున్న సినిమా కుబేర. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్.ఎల్.పి బ్యానర్ లో సునీల్ నారంగ్ ఈ మూవీ నిర్మిస్తున్నారు. సినిమాలో మన కింగ్ నాగార్జున కూడా నటిస్తున్నారు. కుబేర సినిమాలో ధనుష్ సరసన రష్మిక మందన్న హీరోయిన్ గా నటిస్తుంది. ఈ సినిమాకు దేవి శ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందిస్తున్నారు. సినిమా నుంచి లేటెస్ట్ గా ఫస్ట్ సింగిల్ ప్రోమో రిలీజ్ చేశారు. కుబేర సినిమా నుంచి పొయ్ రా.. పొయ్ రా మామా అంటూ సాంగ్ ప్రోమో రిలీజైంది. ఈ ప్రోమోతోనే సాంగ్ పై ఒక మంచి బజ్ క్రియేట్ చేశారు. దేవి మ్యూజిక్ అంటే ఇన్ స్టంట్ గా ఎక్కేస్తాయి. అందులో భాగంగానే కుబేర ఫస్ట్ సాంగ్ ప్రోమో అదిరిపోయింది. ఈ సాంగ్ ని ధనుష్ ఆలపించగా శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. కుబేర సినిమా సాంగ్ ప్రోమోకి ఆడియన్స్ నుంచి సూపర్ రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమాలో ధనుష్ పాత్రలో చాలా వేరియేషన్స్ ఉంటాయని తెలుస్తుంది. ఈ సినిమాలో నాగార్జున రోల్ కూడా ఆడియన్స్ ని సర్ ప్రైజ్ చేస్తుందని అంటున్నారు. శేఖర్ కమ్ముల ఈ కథను ఆయన స్టైల్ లో తెరకెక్కించబోతున్నారని తెలుస్తుంది. రాయన్ తో సూపర్ హిట్ అందుకున్న ధనుష్ కుబేర సినిమాతో మరో హిట్ టార్గెట్ పెట్టుకున్నాడు. కుబేర సినిమా తో పాటు ధనుష్ ఇడ్లీ కొడై సినిమా చేస్తున్నాడు. ఆ సినిమా ధనుష్ డైరెక్షన్ లో వస్తుంది. కుబేర సినిమాను తెలుగు తమిళంతో పాటు పాన్ ఇండియా రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు. సినిమాపై ఇప్పటికే సూపర్ బజ్ క్రియేట్ కాగా అందుకు తగినట్టుగానే సినిమా నుంచి ప్రచార చిత్రాలు వస్తున్నాయి. ధనుష్ నాగార్జున రష్మిక మందన్న ఈ స్టార్ కాంబినేషన్స్ తో వస్తున్న కుబేర సినిమా సంథింగ్ స్పెషల్ కానుంది. తప్పకుండా ఈ కాంబో అంచనాలను అందుకునే ఛాన్స్ ఉందని చెప్పొచ్చు. శేఖర్ కమ్ముల సినిమా అంటే తప్పకుండా ఆడియన్స్ ని మెప్పించేలా ఉంటుంది. అందులోనూ ధనుష్ తో శేఖర్ కమ్ముల చేస్తున్న ఈ కుబేర మీద భారీ హైప్ ఏర్పడింది. మరి ఈ సినిమాపై ఉన్న ఈ ఎక్స్ పెక్టేషన్స్ కి తగిన ఫలితం ఉంటుందా లేదా అన్నది చూడాలి. ఐతే సినిమా నుంచి వచ్చిన ఫస్ట్ సాంగ్ ప్రోమో మాత్రం అదరగొట్టేసిందని చెప్పొచ్చు.



## పాయల్ రాజ్‌పుత్ బోల్డ్ లుక్

టాలీవుడ్‌లో గ్లామరస్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న పాయల్ రాజ్‌పుత్, మళ్లీ తన స్టన్నింగ్ లుక్స్‌తో సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. ఇటీవల ఆమె షేర్ చేసిన ఫోటోషూట్ పిక్స్ నెట్టింట వైరల్‌గా మారాయి. డార్క్ పర్పుల్ గౌన్‌లో, చక్కని మెటాలిక్ బెల్ట్‌తో, హెయిర్ స్టైలింగ్‌ను రెండు పికీటైల్స్‌లా మార్చి తనను ఒక డిఫరెంట్ గ్లామర్ లుక్‌లో చూపించింది. ముఖ్యంగా ఒక ఫోటోలో కనబడిన తీరు తీరు నెటిజన్లను ఆకట్టుకుంది. పాయల్ ఈ ఫోటోషూట్‌లో స్టైల్‌తో పాటు ఫన్ మూమెంట్స్‌ను కూడా కలిపింది. ఒకవైపు బోల్డ్ ఎక్స్‌ప్రెషన్స్‌తో ఆకట్టుకోగా, మరోవైపు చిరునవ్వుతో ఫోటోలకే కొత్త స్పార్క్ ఇచ్చింది. "మీ హృదయం ఎల్లప్పుడూ మిమ్మల్ని నడిపించనివ్వండి" అనే క్యాప్షన్‌తో ఈ ఫోటోషూట్‌లో ఉన్న భావోద్వేగాన్ని చెప్పకనే చెప్పింది. పాయల్ రాజ్‌పుత్ కెరీర్‌ను పరిశీలిస్తే.. పంజాబీ చిత్రాలతో ప్రారంభమైన ఆమె ప్రయాణం, 'RX100'తో తెలుగులో బ్రేక్ ఇచ్చింది. ఆ సినిమా తరువాత ఆమెను గ్లామర్ బ్యూటీగా చూడటం మొదలుపెట్టారు. 'వెంకీ మామ', 'డిస్కోరాజా', వంటి సినిమాలతో టాలీవుడ్‌లో మంచి మార్క్ ఏర్పరచుకుంది. ఈ మధ్య పాయల్ పోస్ట్ చేసే ఫోటోలు, క్యాప్షన్లు, క్యాజువల్ బోల్డ్ స్టైల్.. వాటన్నిటిలోనూ ఆమె తన అస్తిత్వాన్ని, భావప్రదర్శనను స్పష్టంగా చూపిస్తోంది. ఈ లేటెస్ట్ ఫోటోసెషన్ చూస్తే, పాయల్ గ్లామర్ గేమ్‌ను మరింత హై స్టాండర్డ్‌కు తీసుకెళ్లే దిశగా ఉందని చెప్పవచ్చు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.